ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 32.0
కనిష్ఠం : 26.0


ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

ఏలూరు
జిల్లా వార్తలు

3

మంగళవారం 9 జూలై 2024



నామినేటెడ్ వరం.. ఎవరికో..?



నియోజకవర్గానికి 100 పేర్లతో జాబితాలు

- టీడీపీ అధిష్ఠానం సూచించింది ఇదే..
- అక్రమ కేసుల్లో బాధితులకే అధిక ప్రాధాన్యత
- ఈసారి మారిన నామినేటెడ్ కొలువుల ఛాన్స్
- భారీ జాబితాలతో నష్టమంటున్న కేడర్
- అధిష్ఠానానికి సంకేతాలు పంపేందుకు సన్నాహాలు

పార్టీలో ఐదేళ్లపాటు కష్టనష్టాలకు ఎదురొడ్డి పార్టీ కోసం, విజయం కోసం నిరంతర కష్టపడిన, వైసీపీ అరాచకాల కు బలైన, అక్రమ కేసులకు గురైన వారందరి కి తగిన గౌరవం ఇవ్వాలని ఇప్పటికే టీడీపీ నిర్ణయిం చింది. నియోజక వర్గాల వారీగా అక్రమ కేసులు ఎదుర్కొన్న వారిని, వైసీపీ అరాచకాలకు దీటుగా ఎదురొడ్డి నిలబడిన వారిని గుర్తించే పనిలో పడ్డారు. నియోజకవర్గ స్థాయిలో అందరిని గుర్తించి తమకు జాబితా అందజేయాల్సిందిగా ఆదేశించింది. జిల్లా వ్యాప్తంగా నియోజకవర్గాల వారీగా టీడీపీ అధిష్ఠానం మార్గదర్శక సూత్రాలకు అనుగుణంగానే దాదాపు 100 మంది పేర్లకు తగ్గకుండా ఒక్కో నియోజక వర్గం నుంచి జాబితాను అధిష్ఠానంకు పంపారు. ఇక నిర్ణయించాల్సింది, పదవులు ఎవరెవరికి ఇవ్వాల్సింది అధిష్ఠానమే.

(ఏలూరు, ఆంధ్రజ్యోతి, ప్రతినిధి)

ఒకప్పుడు తెలుగుదేశం అధికార పగ్గాలు చేపట్టిన వెంటనే ఎమ్మెల్యేలు, మంత్రులు లేదా ముఖ్యనేతలు సిఫార్సులు చేసిన వారికి నామినేటెడ్ పదవులు దక్కాయి. పార్టీ విజయం కోసం కష్టించి పనిచేసిన అనేక వందల మంది అలాచూస్తూ ఊరుకునేవారు. పార్టీమీద ఉన్న అభిమానం అలాంటిది. ఎమ్మెల్యేలకు అనుంగ శిష్యులుగా ఉన్నవారికి సామాజిక వర్గాల్లో కాస్తంత బలం ఉన్నవారికి పదవులు దక్కేవి. ఫలానా వారికి నామినేటెడ్ పదవి వచ్చిందని, ప్రకటన వెలువడితే తప్ప అంతకు ముందుగా ఊహించడమే కష్టంగా ఉండేది. ఈ పరిస్థితిని అంతటిని తెలుగుదేశం గడిచిన ఐదేళ్లల్లో ఆసాంతం పరిశీలించింది. తెలుగుదేశం కేడర్ ఊరు,వాడా వైసీపీ అరాచకాలను తట్టుకుని, నిలబడి పార్టీ విజయం కోసం ఎంతలా శ్రమించారో స్వయంగా ఇప్పుడు పరిగణలోకి తీసుకుంటున్నారు.

టీడీపీలో ఎవరైతే కష్టపడి పనిచేస్తారో, వైసీపీకి వ్యతిరేకంగా నిలబడతారో అటువంటి వారిని గడిచిన ఐదేళ్లల్లో అప్పటి వైసీపీ ప్రభుత్వం టార్గెట్ చేసింది. ఎక్కడికక్కడ కొందరి ఆస్తులను ధ్వంసం చేసింది. మరి కొందరిపై అక్రమ కేసులు బనాయించింది. వైసీపీ వాళ్ల దాడి చేసినా టీడీపీ వాళ్ల మీదే కేసు బనాయించేవారు. ఇలాంటి పరిణామాలన్నింటిని తెలుగుదేశం ముఖ్యనేతలంతా భరించారు. ఆఖరికి పార్టీ అధినేత చంద్రబాబు అరెస్ట్ అయిన సమయంలోనూ ఎవరెవరు వైసీపీకి వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేస్తుంది గమనించి వారిపైనా పోలీసులు కేసులు నమోదు చేశారు. ఇలా ఒకరు కాదు, ఇద్దరు కాదు ప్రతి నియోజక వర్గంలోనూ పెద్ద సంఖ్యలో సాధారణ కార్యకర్తల మీద కేసులు లెక్కలేనన్ని నమోదయ్యాయి. ఒకవేళ ప్రస్తుత తాజా చట్టమే లేకపోతే టీడీపీ కార్యకర్తలతో జైళ్ళు అన్ని ఎప్పుడో కిక్కిరిసిపోయి ఉండేవి. అంతలాగా వైసీపీ వేధింపులను టీడీపీ కేడర్ ధైర్యంగా ఎదుర్కొంది. ద్వారకా తిరుమలతో పాటు అనేక మండలాల్లో కార్య కర్తలపై ఏకంగా హత్యాప్రయత్నాలు జరిగాయి. ఇంకొన్నిచోట్ల పంట పొలాలకు వెళ్ళే దారుల్లోనూ ఇంటి స్థలాల్లోనూ వివాదాలు సృష్టించారు. ఇక తెలుగుదేశం బతికిబట్ట కట్టరాదనే ధోరణిలోనే వైసీపీ వ్యవహరించింది. అప్పట్లో తెలుగుదేశం అధ్యక్షుడిగా ఇదంతా గమనించిన చంద్రబాబు ఎన్నికల సభల్లో మాట్లాడుతూ అక్రమ కేసులు అంతు తేలుస్తామని, అధికారంలోకి వచ్చాకా ఈ కేసుల వ్యవహారం నిగ్గుతేల్చి ఎవరైతే అక్రమ కేసుల్లో ఇరుక్కునారో వారందరికి పార్టీలో తగు గౌరవం ఇచ్చేలా చూస్తానని భరోసా ఇచ్చారు. ఇప్పుడు ఆ భరోసా నేపథ్యంలోనే టీడీపీ ముఖ్యనేతలు, కేడర్ అందరికి నామినేటెడ్ పదవుల ప్రక్రియకు కూటమి ప్రభుత్వం దాదాపు సంసిద్ధమై తగు సంకేతాలు పంపింది.

ఈసారి అంతా కేడర్‌కే పట్టం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి నిత్యం కష్టించి పనిచేసిన కేడర్‌కు ఇప్పుడు నామినేటెడ్ పదవుల్లో స్థానం కల్పించి, వారికి గౌరవప్రదమైన గుర్తింపు తెచ్చేందుకు కూటమి ప్రభుత్వం సంసిద్ధమైంది. దీనిలో భాగంగానే ప్రత్యేకంగా తెలుగుదేశం తన పార్టీ కేడర్‌లో ఎవరెవరు, ఎక్కడెక్కడ ఏఏ రీతుల్లో వైసీపీతో నిర్భీతిగా పోరాడింది, అక్రమ కేసుల్లో అలవోకగా ఎదుర్కొంది, ఆస్తి, ప్రాణనష్టం జరిగినా వెనుకంజ వేయకుండా పార్టీనే నమ్ముకున్నది ఎవరు? అనే అంశాలపై జిల్లాల వారీగా జాబితాలను సేకరించే పనిలో పడింది. ప్రతి నియోజకవర్గం నుంచి వందమందికి తగ్గకుండా గుర్తించి జాబితాలను పంపాల్సిందిగా ఆదేశాలు జారీ చేసింది. క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు, యూనిట్ ఇన్‌చార్జ్‌లు, మండల అధ్యక్ష కార్యదర్శులతో పాటు పార్టీలో వివిధ కేడర్‌లలో పనిచేస్తున్న వారందరి కష్టనష్టాలను గడిచిన ఐదేళ్ళల్లో బేరీజు వేసి మరీ తాము సూచించిన యాప్‌లోనే నమోదు చేసేందుకు అనువుగా ఇప్పటికే నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లకు ఒక స్పష్టత ఇచ్చింది. ఎక్కడైతే నియోజక వర్గాల్లో గెలిచిన ఎమ్మెల్యేలు ఉంటారో, వారి సమక్షంలోనూ, మరెక్కడైతే నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు ఉంటారో వారి సాయంతోనే ప్రతి నియోజకవర్గం నుంచి 100 మందికి తగ్గకుండా తాము సూచించిన మార్గదర్శకసూత్రాలకు అనుగుణంగానే పేర్లను వీలైతే ఈనెల 8,9 తేదీల నాటికే తాము సూచించిన యాప్‌లలో నమోదు చేయాలని ప్రకటించింది. ఈ నేపథ్యం లోనే జాబితాలన్ని ఎక్కడికక్కడ పరిశీలించి అన్ని కోణాలను పరిగణలోకి తీసుకుని, అందరి పేర్లను జాబితాలోకి చేర్చి అధిష్ఠానానికి నివేదించే పనిలో పడ్డారు.

అందరికి న్యాయం జరిగేనా?

ఒకప్పుడు మాదిరిగా కాకుండా ఈ సారి నామినేటెడ్ పోస్టుల భర్తీలో తెలుగుదేశం వినూత్న ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. దీనికి అనుగుణంగానే ప్రతి నియోజకవర్గం నుంచి వందమంది పేర్లతో కూడిన జాబితాను కోరింది. పార్టీలో కష్టపడి పనిచేసిన వారందరికి తగు భాగస్వామ్యం కల్పించేలా కసరత్తుకు దిగింది. అయితే పార్టీ ఆదేశించిన మేరకు ప్రతి నియోజక వర్గానికి 100మంది పేర్లను పంపించాలన్న నిర్ణయం పార్టీలో అందరికి రుచించడం లేదు. ఎందుకనంటే ఎవరైతే పార్టీకి కోసం కష్టపడి పనిచేశారో, ఐదేళ్ళ పాటు కష్టనష్టాలకు ఓర్చి పార్టీయే ప్రాణంగా నిలబడ్డారో, వారు ఎవరు అనేది ఇప్పటికే ఒక స్పష్టత వచ్చింది. కాని ఇప్పుడు నామినేటెడ్ పదవుల పంపకంలో ప్రతి నియోజకవర్గం నుంచి 100 మంది పేర్లు ఉండాలన్న ప్రతిపాదనపై కొంత అసంతృప్తే వ్యక్తమవుతోంది. ప్రతి నియోజకవర్గంలోనూ ఎలా కాదన్నా కనీసం రెండు డజన్లకే ముఖ్యనేతలు, కార్యకర్తలు ఇప్పటికే అక్రమ కేసుల్లో ఇరుక్కున్నారు. జిల్లా వ్యాప్తంగా పార్టీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులతో పాటు పార్టీలో వివిధ హోదాల్లో ఉన్న నేతలు, కార్యకర్తలు అందరిపై దాదాపు 700కు పైబడే చిన్నా చితకా కేసులు నమోదై ఉన్నాయి. కేవలం కక్ష సాధింపులకు దిగి తమకు సంబంధం లేని కేసుల్లోనూ టీడీపీ కార్యకర్త పేర్లను అప్పట్లో పోలీసులు చేర్చేశారు. వీరందరి విషయంలోనూ తెలుగుదేశం జాగ్రత్తలు తీసుకోవాలని భావించినా, ఉన్న కొద్దిపాటి నామినేటెడ్ పోస్టుల్లో, పార్టీ పదవుల్లో ఇంతమందిని చొప్పించడం సాధ్యమా? కాదా? అనేదే ప్రస్తుతం అందర్ని వేధిస్తున్న ప్రశ్న. జిల్లావ్యాప్తంగా ఉన్న దాదాపు రెండు డజన్ల మందికి పైగా ముఖ్యనేతలు ఆర్థికభారంతో పాటు మిగతా అనేక సమస్యలను ఎదుర్కొన్నారు. ఇలాంటి తరుణంలో ఒకవేళ 100 మంది పేర్లు సేకరించి కేవలం కొద్దిమందికి మాత్రమే పదవులు ఇస్తే మిగతా వారిలో అసంతృప్తి పెచ్చరిల్లిపోదా.. అనే ప్రశ్న అందరిలోనూ ఉంది. ఈ విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఇంకోసారి ఆచితూచి వ్యవహరించాలన్నదే అందరి అభిలాషగా కనిపిస్తోంది. ప్రస్తుతం ఏలూరు జిల్లా వ్యాప్తంగా గెలిచిన ఎమ్మెల్యేల్లో అత్యధిక కేసులు దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌పై ఉండగా, జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులపై డజనుకు పైగానే కేసులు ఉన్నాయి. తెలుగుదేశం అధిష్ఠానం నామినేటెడ్ పదవుల పంపకంలో ఎవరెవరికి అవకాశం ఇస్తుందో, ఇవ్వబోతుందో, మరో వారం, పది రోజుల్లో ఓ స్పష్టత రాబోతుంది.



ఇబ్రహీంపేటలో సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ వెట్రిసెల్వి

పరిహారం ఇచ్చాకే తరలిస్తాం..

- పోలవరం నిర్వాసితులకు కలెక్టర్ వెట్రిసెల్వి భరోసా

కుక్కునూరు/వేలేరుపాడు, జూలై 8 : పోలవరం నిర్వాసితులకు పునరావాస ఇళ్ల పరిహారం చెల్లించిన తర్వాతే పునరావాస కాలనీలకు తరలిస్తామని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అన్నారు. సోమవారం ఇబ్రహీంపేట ఇసుక రీచ్ ప్రారంభోత్సవానికి కలెక్టర్ విచ్చేశారు. ఈ క్రమంలో ప్రజల సమస్యలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. గుంపెనగూడెం పోల వరం నిర్వాసితులకు వ్యక్తిగత పునరావాస పరిహారం చెల్లించారు కానీ భూములు ముంపులో లేవని పరిహారం చెల్లించలేదని కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. పెదరావి గూడెం ఉన్నత పాఠశాలలో మరుగుదొడ్లు లేవని, పలు పాఠశాలల్లో విద్యార్థులు తాగడానికి తాగునీరు లేదని ప్రజలు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా చర్యలు తీసుకోవాలని విద్యాశాఖాధికారులను కలెక్టర్ ఆదేశించారు. ప్రజలు అందించిన ప్రతీ సమస్యను పరిష్కరించేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఏఎస్పీ ఎన్.సూర్యచంద్రరావు, ఆర్డీవో కె.అద్దయ్య, డీపీవో శ్రీనివాస్ విశ్వనాథ్, ఆర్డీవో శ్రీహరి, గనులశాఖ ఏడీ జి.సునీల్‌బాబు, తహసీల్దార్ అచ్యుతకుమారి పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ వేలేరుపాడు ఎంపీడీవో కార్యాలయంలో వరదలపై సమీక్ష నిర్వహించారు. గోదావరికి వరదలు వచ్చే ప్రమాదం ఉన్నందున ముందస్తు జాగ్రత్త చర్యలపై ప్రతీ శాఖ ప్రణాళికను సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ అధికారులకు ఆదేశించారు.మూడు నెలల పాటు అధికారులందరూ తమకు నిర్దేశించినా ప్రాంతాల్లోనే ఉండాలి. ఏ ఒక్కరు విధులకు గైర్హాజరైనా కఠిన చర్యలు తీసుకుంటాం' అని హెచ్చరించారు. ఐటీడీఏ పీవో ఎం.సూర్యతేజ, ఆర్డీవో అద్దయ్య ఉపరవాణా కమిషనర్ శాంతకుమారి, డీపీవో తూతిగ శ్రీనివాస్ విశ్వనాథ్, ఎంపీడీవో శ్రీహరి, తహసీల్దార్ చిన్నారావు, ఎంపీపీ లక్ష్మీదేవి, జడ్పీటీసీ రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపేట, వింజరం ఇసుక డిపోలు ప్రారంభం

కుక్కునూరు, జూలై 8 : ఇబ్రహీంపేట, వింజరం ఇసుక డిపోలను సోమవారం సాయంత్రం కూటమి నాయకులు ప్రారంభించారు. వాస్తవానికి సోమవారం ఉదయం కలెక్టర్ కె.వెట్రిసెల్వి, పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు ఇసుక డిపోలు ప్రారంభించాల్సి ఉంది. అయితే ఇసుక పాలసీ విధివిధానాలకు సంబంధించి ఉత్తర్వులు రాకపోవడంతో ప్రారంభించలేదు. కేవలం వింజరం ఇసుక డిపో పరిశీలించి వెనుదిరిగారు. అయితే మధ్యాహ్నం ఉత్తర్వులు జారీ కావడంతో కూటమి నాయకులు ఇసుక డిపోలను ప్రారంభించారు. ఇబ్రహీంపేట ఇసుక డిపో టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు ములిశెట్టి నాగేశ్వరరావు, బీజేపీ మండల అధ్యక్షుడు తూము వెంకటేశ్వరరావు ప్రారంభించారు. అదే విధంగా వింజరం ఇసుక డిపోను జనసేన మండల పార్టీ అధ్యక్షుడు ఎం.యుగంధర్ ప్రారంభించారు. అనంతరం ప్రభుత్వం విధించిన రుసుము చెల్లించిన అనంతరం ఇసుకను లోడు చేసి ప్రజలకు అందించారు.



ఇబ్రహీంపేటలో ఇసుక డిపోను ప్రారంభిస్తున్న నాయకులు

కిడ్నీ బాధితులపై నివేదిక ఇవ్వండి

- డీఎంవోను ఆదేశించిన కలెక్టర్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

బుట్టాయగూడెం, జూలై 8 : రామ నర్సాపురంలో కిడ్నీ బాధితుల ఆవేదనపై 'ఊరంతా కిడ్నీ బాధితులే' శీర్షిక 'ఆంధ్రజ్యోతి'లో సోమవారం ప్రచురితమైన కథనంపై కలెక్టర్ కె.వెట్రిసెల్వి స్పందించారు. తక్షణమే కిడ్నీ బాధితులపై పూర్తి నివేదికను అందజేయాలని జిల్లా మలేరియా అధికారి, డిప్యూటీ డీఎంహెచ్‌వో జె.సురేష్‌కుమార్‌ను ఆదేశించారు. వైద్య సేవలు అందించడంలజాప్యం ఎందుకు జరిగిందంటూ సంబంధిత అధికారు లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలో సుమారు 30 మందికి పైగా కొండరెడ్లు కిడ్నీలో రాళ్ళ సమస్యతో ఏళ్లతరబడి బాధపడుతున్న విషయం తెలి సిందే. కాగా కలెక్టర్ ఆదేశాలతో కదలిక వచ్చిన అధికారులు మొదటగా సూపర్‌వైజర్లను, సిబ్బందిని గ్రామానికి పంపి పూర్తి వివరాలను సేకరిస్తున్నారు. గ్రామంలోని మంచినీటిని పరీక్షలు చేయిస్తున్నారు.

ఏపీ టెట్ షెడ్యూలు సవరణ

ఏలూరు అర్బన్, జూలై 8 : ఉపాధ్యాయ అర్హతా పరీక్ష (ఏపీ టెట్-2024) షెడ్యూల్‌ను సవరించారు. నోటిఫికేషన్ జారీ తేదీ నుంచి పరీక్ష నిర్వహణకు 90 రోజుల వ్యవధి ఉండాలనే నిబంధన మేరకు షెడ్యూలులో కొద్దిపాటి మార్పులు చేశారు. సవరించిన షెడ్యూల్ ప్రకారం ఆన్‌లైన్ దరఖాస్తుకు గడువు ఆగస్టు 3వ తేదీ, ఆన్‌లైన్ మాక్‌టెస్టు సెప్టెంబరు 19 నుంచి, హాల్‌టిక్కెట్ల డౌన్‌లోడ్ 22 నుంచి ఉంటాయి. ఆన్‌లైన్ విధానంలో పరీక్షలు రోజుకు రెండు విడతల్లో అక్టోబరు 3నుంచి 20వ తేదీ వరకు జరుగుతాయి. ప్రాథమిక కీ అక్టోబరు 4న, అభ్యంతరాల స్వీకరణ 5నుంచి, తుది కీ విడుదల 27న ఉంటాయి. తుది ఫలితాలను నవంబరు 2న ప్రకటిస్తారు.

ఆరుగురు ఏఎస్ఐలకు ఎస్ఐలుగా పదోన్నతులు

ఏలూరు క్రైం, జూలై 8 : జిల్లాలో పనిచేస్తున్న ఆరుగురు ఏఎస్ఐలకు ఎస్ఐలుగా పదోన్నతి కల్పిస్తూ ఏలూరు రేంజ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ జనరల్ ఆఫ్ పోలీస్ జీవీజీ అశోక్‌కుమార్ ఆదేశాల మేరకు జిల్లా ఎస్పీ డి.మేరీ ప్రశాంతి ఉత్తర్వులు జారీ చేశారు. విజయవాడ గవర్నమెంట్ రైల్వే పోలీస్ స్టేషన్‌లో పని చేస్తున్న ఏలూరు జిల్లాకు చెందిన పి.సైమన్‌కు ఎస్ఐగా పదోన్నతి కల్పించి విజయ వాడ ఎన్టీఆర్ పోలీస్ కమిషనరేట్‌కు నియమించారు. చేబ్రోలులో ఏఎస్ఐగా పని చేస్తున్న కె.సాంబశివరావుకు ఎస్ఐగా పదోన్నతి కల్పించి ఏలూరు జిల్లాకు నియ మించారు. ఏలూరు రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఏఎస్ఐగా పనిచేస్తున్న వై.కృపాదానం, ఏలూరు టూటౌన్‌లో పనిచేస్తున్న ఏఎస్ఐ బి.ఆనందబాబుకు ఎస్ఐగా పదోన్నతి కల్పించి విజయ వాడ ఎన్టీఆర్ పోలీస్ కమిషనరేట్‌కు నియమించారు. ద్వారకా తిరుమల ఏఎస్ఐగా పనిచేస్తున్న ఆర్.రాంబాబు, ఏలూరు టూటౌన్‌లో ఏఎస్ఐగా పనిచేస్తున్న ఎం.అర్జునరావులను ఎస్ఐగా పదోన్నతిపై ఏఎస్ఆర్ జిల్లా పాడేరుకు నియమించారు.

పుంజుకున్న సార్వా

- నాలుగు రోజులుగా జిల్లా వ్యాప్తంగా కురుస్తున్న వర్షాలు
- 32.4 శాతం వరి నారుమళ్లు , 5.7 శాతం నాట్లు పూర్తి

ఏలూరు సిటీ, జూలై 8 : నైరుతి రుతుపవనాలు, బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం కారణంగా జిల్లా వ్యాప్తంగా నాలుగు రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో సార్వా వరి సాగు పనులు జోరందుకున్నాయి. మొక్కజొన్నతో పాటు అపరాల సాగు పనులు కూడా ఉపందుకున్నాయి. జూన్‌లో అడపాదడపా వర్షాలు కురిసినా జిల్లాలో సార్వా వరి సాగు పనులు మందకొడిగా సాగాయి. సాధారణంగా జూన్ నెలాఖరు నాటికే నారుమళ్ళు పూర్తి కావాల్సి ఉంది. అయితే అననుకూల వాతావరణంతో సార్వా వరి సాగు పనులు అంతంత మాత్రంగానే సాగాయి. జూలై ఆరంభం నుంచి బంగాళాఖాతంలో అల్పపీడన ద్రోణి, ఉపరితల ఆవర్తనం ఏర్పడడంతో జిల్లాలో వర్షాలు కురుస్తుండడంతో సార్వా పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు.

3,790 ఎకరాల్లో వరి నారుమళ్లు పూర్తి

జిల్లాలో ఈ ఏడాది సార్వా వరి సాగును 2,33,739 ఎకరాల్లో చేయాలని జిల్లా వ్యవసాయ శాఖ నిర్దేశించుకుంది. ఈ మేరకు 11,687 ఎకరాల్లో వరి నారుమళ్ళు వేయాల్సి ఉండగా ఇప్పటివరకు 3,790 ఎకరాల్లో (32.4 శాతం) వరి నారుమళ్ళు వేశారు. ఇక జిల్లాలో 2,33,739 ఎకరాల్లో వరి నాట్లు వేయాల్సి ఉండగా ఇప్పటివరకు 13,422 (5.7 శాతం) ఎకరాల్లో వరినాట్లు వేశారని జిల్లా వ్యవసాయ శాఖ నివేదికలు చెబుతున్నాయి. అత్యధికంగా ఉంగుటూరు మండలంలో 1042 ఎకరాల్లో వరి నారుమళ్ళు, 5,940 ఎకరాల్లో వరి నాట్లు , భీమడోలు మండలంలో 640 ఎకరాల్లో వరి నారుమళ్ళు, 4,290 ఎకరాల్లో వరి నాట్లు పనులు పూర్తయ్యాయి. జిల్లాలోని మిగిలిన మండలాల్లో పరిశీలిస్తే అంతంత మాత్రంగానే నారుమళ్ళు, వరి నాట్లు పనులు పూర్తయ్యాయి. దెందులూరు మండలంలో వరి నారుమళ్ళు పనులు 864 ఎకరాల్లో వేయాల్సి ఉండగా ఇప్పటివరకు 195 ఎకరాల్లో మాత్రమే జరిగాయని చెబుతున్నారు. ఏలూరు, కైకలూరు, కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో ఇప్పటివరకు నారుమళ్ళ పనులు ప్రారంభం కాలేదని వ్యవసాయ శాఖ నివేదికలు చెబుతున్నాయి. జిల్లాలోని ఆగిరిపల్లి, బుట్టాయిగూడెం, చింతలపూడి, ఏలూరు, జంగారెడ్డిగూడెం, జీలుగుమిల్లి, కామవరపుకోట, కొయ్యలగూడెం, కుక్కునూరు, ముదినేపల్లి, ముసునూరు, నిడమర్రు, నూజివీడు, పెదవేగి, టి.నరసాపురం, వేలేరుపాడు మండలాల్లో నాట్లు పనులు ఇంకా ప్రారంభం కాలేదని జిల్లా వ్యవసాయ శాఖ నివేదికలు చెబుతున్నాయి. వర్షాల రాకతో ఆయా ప్రాంతాల్లో కూడా వరినారుమళ్ళు, నాట్లు పనులు జోరుగా అవకాశాలు కనిపిస్తున్నాయని వ్యవసాయ శాఖాధికారులు చెబుతున్నారు.

సాగుతున్న ఇతర పంటల సాగు

జిల్లాలో సార్వా సాగులో ఇతర పంటల సాగు కూడా అంతంత మాత్రంగానే కొనసాగుతోంది. జిల్లాలో మొక్కజొన్న సాధారణ విస్తీర్ణం 2,585 ఎకరాలు కాగా ఇప్పటివరకు 32 ఎకరాల్లో సాగు ఆరంభమైంది. జొన్న పంట సాగు సాధారణ విస్తీర్ణం 27 ఎకరాలు కాగా ఇప్పటివరకు ప్రారంభం కాలేదు. జిల్లాలో 5,985 ఎకరాల్లో అపరాల సాగు ప్రారంభం కావాల్సి ఉండగా ఇంకా ప్రారంభం కాలేదని జిల్లా వ్యవసాయ శాఖ నివేదికలు చెబుతున్నాయి. వేరుశనగ 15 ఎకరాల్లోను, ప్రత్తి 78 ఎకరాల్లోను సాగు ఆరంభమైందని చెబుతున్నారు.

కొనసాగుతున్న వర్షాలు

జిల్లాలో వర్షాలు కొనసాగుతున్నాయి. గడచిన 24 గంటల్లో జిల్లాలో అత్యధికంగా పోలవరం మండలంలో 13.2 మిల్లీ మీటర్లు వర్షపాతం నమోదు కాగా జిల్లాలో 1.8 మి.మీ సరాసరి వర్షపాతం నమోదైంది. కుక్కునూరులో 11.2, బుట్టాయిగూడెం 7.4, జంగారెడ్డిగూడెం 5.2, కొయ్యలగూడెం 4.8, కలిదిండి 4.8, ఆగిరిపల్లి 1.4, లింగపాలెం 0.8, భీమడోలు, ముదినేపల్లిలలో 0.6 మి.మీ వర్షపాతాలు నమోదయ్యాయి.

చెదిరిన కల



- రూ.15 లక్షల జీతంతో సాఫ్ట్‌వేర్ ఉద్యోగానికి మహిళ ఎంపిక
- ఆనందంతో హైదరాబాద్ నుంచి రాజవోలుకు ప్రయాణం
- లక్ష్మీనగర్ వద్ద ఆగి ఉన్న ట్రాలీ లారీని ఢీకొన్న కారు
- తల్లి, కుమారుడు సహా మహిళ మృతి.. ఇద్దరికి గాయాలు
- డ్రైవర్ నిద్రమత్తు.. అతివేగమే ప్రమాదానికి కారణం

హైదరాబాద్‌లో ఉద్యోగం చూసుకుని భర్తతోపాటు అక్కడే పిల్లలతో కలిసి సంతోషంగా ఉండొచ్చన్న ఆమె ఆశలు అడియాశలయ్యాయి. ఏడాదికి రూ.15 లక్షల జీతంతో ఉద్యోగానికి ఎంపికైన ఆనందం కొన్ని గంటలు గడవక ముందే ఆవిరైంది. కారు డ్రైవర్ నిద్రమత్తు, అతివేగం.. ఆమెతోపాటు కుమారుడిని, తల్లిని బలి తీసుకుంది. ఏలూరు జిల్లా ద్వారకా తిరుమల మండలం లక్ష్మీనగర్ జాతీయ రహదారిపై జరిగిన ఈ రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి చెందగా, ఇద్దరికి గాయాలయ్యాయి.



ఇద్దరు కుమారులు నితిన్, షణ్ముఖ్‌లతో తల్లిదండ్రులు నాగార్జున, భాగ్యశ్రీ (ఫైల్)

ద్వారకా తిరుమల, జూలై 8 : తూర్పు గోదావరి జిల్లా రాజమండ్రి రూరల్ మండలం రాజవోలుకు చెందిన రాచబత్తుని నాగార్జున, భాగ్యశ్రీ దంపతులకు ఇద్దరు కుమారులు నాగ షణ్ముఖ్, నాగ నితిన్‌కుమార్ ఉన్నారు. నాగార్జున హైదరాబాద్‌లో ఓ ప్రైవేట్ సెక్యూరిటీ ఏజెన్సీ నిర్వహిస్తూ అతను ఒక్కడే అక్కడ ఉంటున్నాడు. గ్రామంలోనే పిల్లలతోపాటు ఉంటున్న భాగ్యశ్రీ తనకు హైదరాబాద్‌లో ఉద్యోగం వస్తే భర్త వద్దకు వెళ్లే ప్రయత్నాల్లో ఉంది. ఈ నేపథ్యంలోనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఇంటర్వ్యూ నిమిత్తం రెండు రోజుల క్రితం హైదరాబాద్‌కు ఇద్దరు కుమారులతో పాటు భీమవరానికి చెందిన ఆమె తల్లిదండ్రులు బొమ్మా నారాయణ రావు, కమలాదేవితో కలిసి వెళ్లారు. అక్కడ ఇంటర్వ్యూ పూర్తి చేసుకుని ఇద్దరు పిల్లలు, తల్లిదండ్రులతో కలిసి భాగ్యశ్రీ ఆదివారం రాత్రి హైదరాబాద్ నుంచి రాజవోలుకు ప్రయాణమైంది. భర్త నాగార్జున పనిపై అక్కడే ఆగిపోగా, వ్యక్తిగత పనిమీద తండ్రి నారాయణరావు విజయవాడలో కారు దిగిపోయారు. తర్వాత ఆయన ట్రైన్‌లో భీమవరం వెళ్లిపోయారు. మిగిలిన వారు రాజవోలు బయలుదేరారు. సోమవారం తెల్లవారుజామున ద్వారకా తిరుమల మండలం లక్ష్మీనగర్ వద్ద రోడ్డు పక్కన నిలిపి ఉన్న చెన్నై నుంచి కాకినాడకు వెళ్తున్న మిషనరీ లోడు ట్రాలీ లారీని కారు వేగంగా వెనుక నుంచి ఢీకొట్టి ట్రాలీలోకి దూసుకుపోయింది. క్రేన్ సహాయంతో కారును బయటకు తీశారు. భాగ్యశ్రీ (27), నితిన్ కుమార్(4), కమలాదేవి (55) అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్ర గాయాలైన కొవ్వూరు మండలం వాడపల్లికి చెందిన డ్రైవర్ దుర్గావంశీ, చిన్నారి నాగషణ్ముఖ్‌లను స్థానికులు బయటకు తీసి అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం ఏలూరు ఆశ్రం ఆసుపత్రికి తరలించారు. డ్రైవర్ వంశీ పరిస్థితి విషమంగా ఉన్నట్టు సమాచారం. ఎస్పీ మేరీ ప్రశాంతి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. భీమడోలు సీఐ బి.బి.రవికుమార్, పోలీసు సిబ్బంది నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు.





లక్ష్మీనగర్‌లో జరిగిన ప్రమాద దృశ్యాలను పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి ఇన్‌సెట్‌లో కారులో మృతదేహాలు

ప్రమాదానికి కారణమేమిటి..

ఘటనా స్థలంలో సీసీ పుటేజీని పరిశీలిస్తే సరిగ్గా ఉదయం 5.42 గంటలకు వీరు ప్రయాణిస్తున్న ఎర్టికా కారు రోడ్డుపై మెలికలు తిరుగుతూ పక్కన ఆపి ఉంచిన కంటైనర్ లారీని అతివేగంతో ఢీకొట్టింది. డ్రైవర్ దుర్గావంశీ నిద్రమత్తు, అతివేగం లేక వేరే కారణం ఏమైనా ఉందా ? అనేది పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది. నిబంధనలకు విరుద్ధంగా జాతీయ రహదారి పక్కన కంటైనర్‌ను ఆపడం కూడా ప్రమాదానికి కారణమని భావిస్తున్నారు.

విషాదఛాయలు

భాగ్యశ్రీతోపాటు ఆమె కుమారుడు నితిన్, తల్లి కమలా దేవిల మృతితో రాజవోలు, భీమవరంలలో విషాదఛాయలు నెలకొన్నాయి. గుంటూరు జిల్లా భట్టిప్రోలుకు చెందిన నాగార్జునకు భీమవరానికి చెందిన భాగ్యశ్రీకి వివాహం కాగా, వీరి ఇద్దరి కుమారులతో కొన్నాళ్లుగా రాజవోలులోని ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్నారు. భాగ్యశ్రీ తన భర్తకు చేదోడుగా ఉండి కుటుంబాన్ని సమర్థవంతంగా నిర్వహించేందుకు హైదరాబాద్ వెళ్లిపోయి అక్కడే ఉద్యోగం చేయాలని నిర్ణయించి ఇంటర్వ్యూకి వెళ్లింది. ఏడాదికి రూ.15 లక్షలు ప్యాకేజీతో ఎంపికైంది. దీంతో కుటుంబ సభ్యులంతా సంతోషంగా ఉన్నారు. ఆ ఆనందం కొన్ని గంటలు గడవక ముందే ఆ ఇంట విషాదం అలుముకుంది. బంధువులు, కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా రోదిస్తున్నారు.

పోస్టుమార్టం పూర్తి..

ఏలూరు క్రైం : ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో కమలాదేవి, భాగ్యశ్రీ, నితిన్‌కుమార్ మృతదేహాలకు భీమడోలు సీఐ రవికుమార్, ద్వారకాతిరుమల ఎస్ఐ సతీష్, ఏఎస్ఐ రాగిరి రాంబాబు శవ పంచనామా నిర్వహించారు. ప్రభుత్వాసుపత్రి ఇన్‌చార్జి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ పీఏఆర్ఎస్ శ్రీనివాసరావు ఆదేశాలతో ఆర్ఎంవో డాక్టర్ ప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో మృతదేహాలకు వైద్య నిపుణులచే పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

కూర్మావతారంలో శ్రీజగన్నాథుడు



ద్వారకాతిరుమల, జూలై 8: కూర్మావతారంగా శ్రీజగన్నాథస్వామి సోమవారం భక్తులకు దర్శనమిచ్చారు. పురాతన ఆలయమై, శ్రీవారి ప్రధానాలయానికి దత్తత దేవాలయమై విరాజిల్లుతున్న ఈ ఆలయంలో జగన్నాథ రథోత్సవాలను పురస్కరించుకుని స్వామివారు రోజుకో అలంకారంలో భక్తులను కటాక్షిస్తున్నారు. ఇందులో భాగంగా కూర్మరూపంలో శంఖు, చక్రాలను ధరించి అభయ హస్తాన్ని ప్రసాదిస్తున్న అలంకారంలో ఉన్న జగన్నాథుని పలువురు భక్తులు దర్శించుకున్నారు.

ఇంటర్ అడ్మిషన్ల గడువు మరోసారి పొడిగింపు

గణపవరం, జూలై 8: ప్రభుత్వ కళాశాలల్లో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశాల గడువును ఈ నెల 31వ తేదీ వరకు ఇంటర్ బోర్డు కార్యదర్శి నిధి మీనా పొడిగించినట్లు గణపవరం జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ సీహెచ్ శ్రీనివాస్‌గౌడ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూలై 31 వరకు దరఖాస్తు చేసుకునే అవకాశముందన్నారు. 10వ తరగతిలో మార్కుల ఆధారంగా ఇంటర్‌లో ప్రవేశం కల్పిస్తామని తెలిపారు.

రాజధాని నిర్మాణానికి విరాళాల సేకరణ



విరాళాలు సేకరిస్తున్న మహిళలు

దెందులూరు, జూలై 8 : రాజధాని అమరావతి నిర్మాణం త్వరగా పూర్తికావాలని ఆకాంక్షిస్తూ కొవ్వలి గ్రామ మహిళాలు తమ వంతు సాయంగా విరాళాలు సేకరిస్తున్నారు. కొవ్వలి టీడీపీ మహిళా విభాగం నాయకురాళ్లు ఇంటింటికి తిరిగి విరాళాలు సేకరిస్తున్నారు. ఈ విరాళాలను ముఖ్యమంత్రికి అందజేస్తామని వారు తెలిపారు.

వెబ్‌సైట్‌లో ఎన్‌ఎంఎంఎస్ మెరిట్ కార్డులు

ఏలూరు అర్బన్, జూలై 8 : జాతీయ ఉపకార వేతన పరీక్ష (ఎన్‌ఎంఎంఎస్)లో జిల్లా నుంచి ఎంపికైన బాల,బాలికల మెరిట్ కార్డులను బీఎస్ఈ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్టు డీఈవో అబ్రహం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన విద్యార్థులు మెరిట్ కార్డుని వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుని విద్యార్థి పేరు, తల్లి లేదా తండ్రి పేరు సరిచూసుకుని జాతీయ విద్యా మంత్రిత్వ శాఖకు చెందిన నేషనల్ స్కాలర్ షిప్ పోర్టల్‌లో ఆగస్టు 31లోగా దరఖాస్తును అప్‌లోడ్ చేయాలన్నారు. అనంతరం, సంబంధిత స్కూల్ నోడల్ ఆఫీసర్, జిల్లా నోడల్ ఆఫీసర్ లాగిన్ ద్వారా దరఖాస్తును ధ్రువీకరింప చేసుకోవాలని సూచించారు. విద్యార్థి పేరు, తల్లిదండ్రుల పేర్లు తదితర వివరాలన్నీ మెరిట్ కార్డులో ఉన్న విధంగానే అక్షరం తప్పు కూడా లేకుండా ఆధార్ కార్డులోను, బ్యాంకు పాస్‌బుక్‌లోనూ ఒకేలా ఉండాలన్నారు. వివరాలు సరిపోలని విద్యార్థులు సంబంధిత స్కూళ్ల హెచ్‌ఎంల ద్వారా ఏలూరు డీఈవో కార్యాలయానికి ధ్రువీకరణలతో సహా అందజేయాలని సూచించారు.

వర్జీనియా పొగాకుకు రికార్డు ధర

జంగారెడ్డిగూడెం, జూలై 8 : వర్జీనియా పొగాకు ధరలు రోజు రోజుకు పెరుగుతున్నాయి. కిలో పొగాకు ధర సోమవారం రూ.376కు చేరి రికార్డు సృష్టించింది. జంగారెడ్డిగూడెంలో ఉన్న రెండు వేలం కేంద్రాల్లో ధరలు ఇదేవిధంగా ఉన్నాయని అధికారులు తెలిపారు. పొగాకు ధరలు పెరుగుతుండడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

స్విమ్మింగ్‌లో జిల్లా క్రీడాకారుల ప్రతిభ



పతకాలు సాధించిన స్విమ్మింగ్ క్రీడాకారులు

ఏలూరు రూరల్, జూలై 8: హైదరాబాద్‌లో ఈ నెల 5,6 తేదీల్లో జరిగిన స్విమ్మింగ్ పోటీల్లో ఏలూరు జిల్లా, విశ్వనాథ్ భత్యా స్విమ్మింగ్ పూల్లో శిక్షణ పొందుతున్న క్రీడాకారులు ప్రతిభ కనబరిచి, పతకాలు సాధించారని కోచ్ బండ్ల గణేష్ తెలిపారు. హిమరియన్న బంగారు, ఎం.ధనుష్‌సాయి, ఎం.రిషిరామ్ బంగారు పతకాలు, ఎం.సంజయ్, టి.అవినాష్ వెండి, రజిత పతకాలు, టి.విష్ణువర్ధన్ రెండు వెండి పతకాలు, ఎం.రిజాయ్‌సన్ రజిత పతకం సాధించారని తెలిపారు. బటర్‌ఫ్లై, ఫ్రీస్టైల్, బ్యాక్‌స్ట్రోక్ విభాగాల్లో స్విమ్మింగ్ పోటీలు జరిగాయని తెలిపారు. విజేతలను కోచ్ గణేష్ అభినందించారు.

ద్వారకా తిరుమలలో నిధుల దుర్వినియోగం

విచారణకు డిమాండ్.. జేసీకి వినతి



వివరాలు తెలుపుతున్న అముక్త

ఏలూరు రూరల్, జూలై 8: ద్వారకా తిరుమల గ్రామ పంచాయతీలో జరిగిన నిధుల దుర్వినియోగంపై పూర్తి విచారణ చేసి దుర్వినియోగమైన సొమ్మును పంచాయతీ కార్యదర్శి నుంచి రికవరీ చేయాలని, శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ ద్వారకాతిరుమల గ్రామానికి చెందిన నిమ్మగడ్డ అముక్త, జిల్లా జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ద్వారకాతిరుమల గ్రేడ్-1, పంచాయతీ సెక్రటరి, పంచాయతీలో నిధుల దుర్వినియోగం చేశాడన్నారు. పన్ను వసూలు సొమ్ము, అక్రమంగా లేఅవుట్ల అనుమతి, పారిశుధ్య కార్మికులు జీతాల్లో చేతివాటం ప్రదర్శించి సుమారు రూ. రెండు కోట్లకు పైనే నిధులు దుర్వినియోగానికి పాల్పడ్డాడని ఆరోపించారు. ఇదే విషయంపై గతంలో జిల్లా కలెక్టర్ ప్రసన్నవెంకటేష్ దృష్టికి తీసుకువెళితే విచారణకు ఆదేశించారని, జిల్లా పంచాయతీ అధికారి, డీఎల్‌పీవో విచారణ చేశారన్నారు. సమగ్ర నివేదిక డీపీవో వద్ద ఉందన్నారు. ప్రస్తుతం విచారణకు సంబంధించి ఫైల్స్ తారుమారయ్యే అవకాశాలు ఉన్నాయని, జేసీ దృష్టికి తీసుకువెళ్ళారు. పంచాయతీ కార్యదర్శి నుంచి దుర్వినియోగం సొమ్మును రికవరీ చేయాలని, విచారణ ఫైళ్ళు మాయం కాకుండా చర్యలు తీసుకోవాలని జేసీని కోరారు.

చేతి సమస్యలపై ప్రత్యేక శిబిరం



కృత్రిమ అవయవాలను అందజేస్తున్న వైద్యులు భాస్కరానంద్, ఆషిష్

ద్వారకా తిరుమల, జూలై 8: స్థానిక విర్డ్ ఆసుపత్రిలో ప్రముఖ హ్యాండ్ సర్జన్ డాక్టర్ భాస్కరానంద్ కుమార్ నేతృత్వంలో సోమవారం ప్రత్యేక క్యాంపు నిర్వహించారు. ఇందులో 40 మందిని పరీక్షించగా 10 మందికి శస్త్రచికిత్సలు చేశారు. ఈ క్యాంపు మంగళవారం కూడా ఉంటుందని, చేతి సమస్యలు, పోలియోతో బాధపడుతున్న వారు ఈ సేవలను సద్వినియోగించుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు సెల్ నెంబర్ 85002 63149లో సంప్రదించాలని ఆయన కోరారు. ఈ క్యాంపులో 12 మంది దివ్యాంగులకు కాలిపర్స్, నలుగురికి కృత్రిమ అవయవాలను అందించారు. వైద్యులు వి.ఆషిష్, భవ్యచంద్ పాల్గొన్నారు.

ఉచిత ఇసుక అమలుకు పటిష్ట చర్యలు



నరసాపురం, జూలై 8 : ప్రభుత్వ మార్గదర్శకాలను అనుగుణంగా ఉచిత ఇసుక విధానాన్ని పటిష్ఠంగా అమలు చేసేందుకు అధికారులు కృషి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ సీవీ ప్రవీణ్ ఆదిత్య సూచించారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ఆర్డీవో ఎం.అచ్యుత్ అంబరీష్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నరసాపురం, అబ్బిరాజుపాలెం, దొడ్డిపట్ల, యలమంచిలి, చించినాడల్లో ఉన్న ఇసుక పాయింట్లలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు నుంచి అనుమతులు యుద్ధ ప్రాతిపదికన పొందాలన్నారు. కొత్తగా గోదావరిలో డీసీల్టింగ్ పాయింట్లను సంబంధిత అధికారులు సంయుక్తంగా క్షేత్రస్థాయిలో పర్యటించి గుర్తించాలన్నారు. జిల్లాలో ఇసుక పాయింట్లలో నిల్వలు, ఉచిత విధానం అమలుకు తీసుకోవల్సిన చర్యలను చర్చించారు. బోట్ మెన్ సొసైటీలు కొన్ని ఇబ్బందులను జిల్లా జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సమావేశంలో జిల్లా గనులు, భూగర్భశాఖాధికారి జి.జయప్రసాద్, కన్జర్వేన్సీ సహాయ సంచాలకులు కేవీ సుబ్బారావు, వివిధ మండలాల తహసీల్దార్లు, బోట్స్‌మెన్ సొసైటీ పాలకవర్గ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

కొత్త ఆవిష్కరణలతో విద్యార్థులు మెరవాలి

ఏపీ నిట్ రిజిస్ట్రార్ డాక్టర్ దినేష్‌శంకర్ రెడ్డి



విద్యార్థులకు బ్యాగ్‌లు అందజేస్తున్న ఆచార్యులు

తాడేపల్లిగూడెం అర్బన్, జూలై 8: సృజనాత్మక ఆలోచనలు, కొత్త ఆవిష్కరణలు, ప్రాజక్టులతో విద్యార్థులు మెరవాలని, సంకల్పమే ఆయుధంగా, విజయమే లక్ష్యంగా ముందుకు సాగాలని ఏపీ నిట్ రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్ శంకర్ రెడ్డి అన్నారు. ఏపీ నిట్, నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'ఇన్‌స్పైర్ మనాక్ మెంటర్ షిప్'అనే అంశంపై రెండు రోజుల పాటు నిర్వహించనున్న వర్క్ షాప్‌ను బొలిశెట్టి రాజేష్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా దినేష్‌శంకర్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి పరిశోధకుడిగా రాణించాలంటే పాఠశాల విద్య నుంచే బలమైన పునాది వేసుకోవాలన్నారు. బట్టీ పట్టే చదువులు మార్కులు తెచ్చిపెడతాయేగాని, మేధావులుగా గుర్తించలేవన్నారు. శాస్త్ర, సాంకేతిక పరిశోధనలకు గణితం, సైన్స్ ఎంతగానో దోహదపడతాయని, విద్యార్థులు ఆయా సబ్జెక్ట్‌లపై పట్టు సాధించాలన్నారు. డీన్ రీసెర్చ్ అండ్ కన్సల్టెన్సీ డాక్టర్ జీఆర్‌కే శాస్త్రి, నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ ప్రాజక్టు అసోసియేట్ డాక్టర్ సునీల్ భాస్కర్, ఎస్‌సీఈఆర్టీ స్టేట్ నోడల్ అధికారి డాక్టర్ భాగ్యశ్రీ మాట్లాడుతూ విద్యార్థులు అంతర్జాతీయ స్థాయిలో రాణించాలంటే సబ్జెక్టులపై పట్టు సాధించడంతో పాటు బహుముఖ నైపుణ్యాలను బాల్యం నుంచే అలవర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమానికి ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగం ఆచార్యులు డాక్టర్ పి.శంకర్ కోఆర్డినేటర్‌గా వ్యవహరించగా హాజరైన విద్యార్థులకు బ్యాగ్‌లు అందజేశారు. కార్యక్రమంలో ఆచార్యులు డాక్టర్ వి.సందీప్, డాక్టర్ పి.శంకర్, డాక్టర్ సుదర్శన దీప, డాక్టర్ వినోత్‌కుమార్ రాజా, డాక్టర్ భరణీధరన్, డాక్టర్ జగన్‌మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

నిలకడగా గోదావరి నీటి మట్టం



స్పిల్వే వద్ద గోదావరి జలాల ఉధృతి

పోలవరం, జూలై 8 : పోలవరంలో గోదావరి నీటి మట్టం సోమవారం సాయంత్రానికి నిలకడగా ఉంది. స్పిల్వేలోకి వస్తున్న గోదావరి జలాలను 48 గేట్ల ద్వారా దిగువకు విడుదల చేయడంతో స్పిల్వేలో సాధారణ నీటి మట్టం మాత్రమే నమోదైంది. పోలవరం ప్రాజెక్టు స్పిల్వే ఎగువన 26.550 మీటర్లు, దిగువన 16.570 మీటర్లు, ఎగువ కాఫర్ డ్యాంకి ఎగువన 26.590 మీటర్లు, దిగువన 15.470 మీటర్లు నమోదైనట్లు ఈఈలు పి.వెంకట రమణ, మల్లికార్జునరావు తెలిపారు.

6,018 క్యూసెక్కుల జలాలు విడుదల



పట్టిసీమ ఎత్తిపోతల పథకం వరద నీటి పరవళ్లు

పోలవరం జూలై 8 : పట్టిసీమ ఎత్తిపోతల పథకం నుంచి 6,018 క్యూసెక్కుల గోదావరి వరద జలాలను పోలవరం ప్రాజెక్టు కుడి కాలువకు విడుదల చేసినట్లు ఎత్తిపోతల పథకం డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు పెద్దిరాజు సోమవారం తెలిపారు. పట్టిసీమలో గోదావరి నీటి మట్టం 14.902 మీటర్లకు చేరుకుందని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 17 పంపులు 17 మోటార్లతో నీటిని విడుదల చేసినట్లు తెలిపారు. ఈ నెలలో 1.8860 టీఎంసీల నీటిని విడుదల చేసినట్లు తెలిపారు.

దూలం అరాచకాలపై ఫ్లెక్సీలు



కైకలూరు, జూలై 8: కైకలూరు మాజీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు అక్రమాలు, అరాచకాలపై ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు కలకలం రేపుతున్నాయి. పట్టణ ప్రధాన కూడళ్లలో నాలుగుచోట్ల జనసేన పార్టీ నేత కొల్లి వరప్రసాద్ (బాబి) భారీ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. వైసీపీ చేసిన అరాచకాలను ఫ్లెక్సీలో జనసేన నాయకుడు ఏర్పాటు చేయడంతో కూడలిలో పెద్ద ఎత్తున ప్రజలు వాటిని తిలకిస్తున్నారు. ప్రచార మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారమైంది. సోమవారం వైఎస్ జయంతిని పురస్కరించుకుని కైకలూరు నీలం సంజీవరెడ్డి మార్కెట్‌లోని వైఎస్ విగ్రహానికి నివాళులర్పించేందుకు మాజీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు, వైసీపీ నాయకులు తరలివచ్చారు. సరిగ్గా విగ్రహం సమీపంలో ఈ ఫ్లెక్సీని ఏర్పాటు చేయడంతో వైసీపీ శ్రేణులు సైతం ఈ ఫ్లెక్సీని ఆసక్తితో తిలకించారు. ఆయన అవినీతి, అక్రమాలపై ప్రస్తుతం ప్రజలకు తెలియజేస్తోంది మచ్చుకే అని, ఇంకా వారు చేసిన దౌర్జన్యాలు ప్రజల ముందుకు తీసుకువస్తానని కొల్లి వరప్రసాద్ విలేకరుల సమావేశంలో వెల్లడించారు.

ముగిసిన నాటిక పోటీలు



ప్రథమ బహుమతి అందజేస్తున్న నిర్వాహకులు

ఏలూరు రూరల్, జూలై 8: ఏలూరు వైఎంహెచ్ఏ, హేలాపురి కళాపరిషత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అల్లూరి సీతారామరాజు స్మారక రాష్ట్ర స్థాయి నాటిక పోటీలు ముగిశాయి. నాటికలన్నీ ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశాయి. 'ఇంద్రప్రస్థం' నాటిక మొదటి బహుమతికి ఎంపికైంది. ద్వితీయ ఉత్తమ ప్రదర్శనగా 'రాటా' నాటికను ఎంపిక చేశారు. మొదటి బహుమతి రూ. ఎనిమిది వేలు, ద్వితీయ బహుమతి రూ.ఐదు వేలు, తృతీయ బహుమతి రూ. మూడు వేలు, ప్రశంసాపత్రం, జ్ఞాపికలను నిర్వాహకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మేనేజ్‌మెంట్ కమిటీ అధ్యక్షుడు సోమలింగేశ్వరరావు, ఇరదల ముద్దుకృష్ణ, జవ్వాజి మోహన్‌విటల్, మజ్జి సూర్యకాంతారావు, లంకా వెంకటేశ్వర్లు, పెదపాటి రామకృష్ణ, గుత్తా కౌసల్యేంద్రరావు హాజరయ్యారు.

కేంద్ర నిధులు దారి మళ్లింపు

గత ప్రభుత్వం తీరుపై కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ విమర్శ



వీహెచ్‌పీ కార్యదర్శిని సత్కరిస్తున్న కేంద్ర మంత్రి వర్మ

తాడేపల్లిగూడెం రూరల్, జూలై 8: రాష్ట్రంలో వివిధ శాఖల అభివృద్ధి కోసం కేంద్రం విడుదల చేసిన నిధులు దారి మళ్లించి గత ప్రభుత్వం రాష్ట్రాభివృద్ధిని విచ్ఛిన్నం చేసిందని కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ విమర్శించారు. తాడేపల్లిగూడెంలోని విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన ఆయన వీహెచ్‌పీ ప్రధాన కార్యదర్శి రాఘవలును సత్కరించి అనంతరం విలేకర్లతో మాట్లాడారు. రాజధాని, పంచాయతీలు, పోలవరం, ఆర్థిక సంఘ నిధులు ఏమయ్యాయో తెలియడం లేదన్నారు. సీఎం చంద్రబాబు గాడిన పెట్టే ప్రయత్నం చేస్తున్నారన్నారు. బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ ఈతకోట తాతాజి, జిల్లా ఉపాధ్యక్షుడు నరిసే సోమేశ్వరరావు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాలలో విజిలెన్స్ అధికారుల తనిఖీలు

రూ.36 లక్షల ఎరువులు, పురుగు మందులు సీజ్



శ్రీహరిపురంలో ఎరువుల షాపులో తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

తాడేపల్లిగూడెం రూరల్, జూలై 8: వ్యవసాయ శాఖ ప్రత్యేక తనిఖీ బృందం ఆరుగొలనులోని విత్తన ప్రోసెసింగ్ యూనిట్‌ను సోమవారం సీజ్ చేశారు. వ్యవసాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు నియోజకవర్గంలోని ఎరువుల గోదాములు, విత్తనాల యూనిట్‌లలో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఆరుగొలను విత్తన ప్రోసెసింగ్ యూనిట్‌లో లెక్కలు సరిగా లేవని రూ.6.85 లక్షల విత్తనాల విక్రయాలు నిలుపుదల చేసినట్టు తనిఖీ బృంద నాయకుడు కె.మహరాజన్ (ఏడీఏ) వివరించారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ సీఐ పి.శ్రీనివాసరెడ్డి, వ్యవసాయ అధికారులు కృష్ణకాంత్, ఆర్ఎస్ ప్రసాద్, పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

● ముదినేపల్లి : జిల్లా విజిలెన్స్ అధికారులు సోమవారం సాయంత్రం ముదినేపల్లి మండలంలోని పలు ఎరువుల దుకాణాలను ఆకస్మిక తనిఖీలు జరిపారు. ముదినేపల్లి, శ్రీహరిపురంలోని దుకాణాలను విజిలెన్స్ సీఐ యూజే విల్సన్, భీమిలిపట్నం ఏడీఏ బి.విజయప్రసాద్ ఆధ్వర్యంలో అధికారుల బృందం తనిఖీలు చేసి, ఎరువుల నిల్వలకు సంబంధించిన రికార్డులు, ఇన్‌వాయిస్‌లను పరిశీలించారు. తనిఖీ చేసిన రెండు దుకాణాల్లోనూ ఎరువులు, పురుగు మందుల నిల్వలకు సంబంధించి రికార్డులు సరిగ్గా లేనందున రూ.22.60 లక్షల విలువైన 186.51 టన్నుల ఎరువులు, రూ.5.97 లక్షల విలువైన పురుగు మందులను సీజ్ చేశారు. వాటి అమ్మకాలను నిలిపివేస్తూ ఆదేశాలు జారీ చేశారు. మండవల్లి ఏడీఏ వెంకటమణి, ఏవో షేక్ జరీనా, వీఏఏలు పవన్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

అదృశ్యమైన మహిళ హత్య !



సత్యవతి (ఫైల్)

తాడేపల్లిగూడెం రూరల్, జూలై 8: ఇంటి నుంచి తాడేపల్లిగూడెం వచ్చిన మహిళ అనుమానాస్పద స్థితిలో హత్యకు గురైన ఘటన ఆరుళ్లలో సోమవారం వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాలివి. ఆరుగొలనుకు చెందిన జానపాముల సత్యవతి (45) ఈ నెల ఒకటో తేదీన బంగారం కొనేందుకు తాడేపల్లిగూడెం వచ్చింది. అయితే తిరిగి ఇంటికి రాకపోయే సరికి కుటుంబ సభ్యులు పట్టణంలో గాలించారు. ఆచూకీ దొరక్కపోవడంతో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. అయితే ఆరుళ్ల కాలువ గట్టులోని తుప్పల్లో మహిళ మృతదేహం కనిపించడంతో పోలీసులు ఆ మృతదేహం సత్యవతిదిగా గుర్తించారు. ఆమెను ఎవరో హత్యచేసి ఆ తుప్పల్లో పడేసి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పట్టణ సీఐ సుబ్రహ్మణ్యం తెలిపారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

పెదపాడు, జూలై 8 : ప్రమాదవ శాత్తు బాత్‌రూంలో కాలుజారిపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ వృద్ధురాలు మృతి చెందిన ఘటనలో పెదపాడు పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. వసంతవాడ గ్రామం అమృత లింగపేటకు చెందిన సంబంగి చిన్నమ్మ (85) గత నెల ఆరో తేదీన బాత్‌రూంలో ప్రమాదవశాత్తు కాలుజారి పడిపోయింది. చికిత్స నిమిత్తం తొలుత ఏలూరు ప్రభుత్వాసుపత్రికి మెరుగైన చికిత్స నిమిత్తం గుంటూరు తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందడంతో కుమారుడు సీతారామయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై కె.శుభశేఖర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బంగారం, వెండి, నగదు చోరీ



చిందర వందరగా దుస్తులు

జంగారెడ్డిగూడెం, జూలై 8: తాడువాయికి చెందిన పసుమర్తి ఏడుకొండలు ఇంట్లో విలువైన బంగారం, వెండి వస్తువులతోపాటు నగదు చోరీకి గురైందని జంగారెడ్డిగూడెం పోలీస్ స్టేషన్‌లో బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ మంగయ్య తెలిపారు. ఈ నెల ఏడో తేదీ ఆదివారం రాత్రి భోజనం అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి ఆరు బయట నిద్ర పోయారు. సోమవారం ఉదయం నిద్ర లేచి చూడగా ఇంటి వెనుక తలుపు గొళ్ళెం తీసి ఉండడం చూసి ఇంట్లోకి వెళ్లి చూడగా బెడ్‌రూమ్ లోపల ఉన్న బీరువా పగలగొట్టి అందులో ఉన్న తొమ్మిది కాసుల బంగారు ఆభరణాలు, అరకేజి వెండి వస్తువులు, కొంత నగదు దోచుకుపోయినట్లు గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్ఐ తెలిపారు.

స్టాఫ్ నర్సుపై దాడికి ఖండన

ఏలూరు అర్బన్, జూలై 8 : తిరుపతి రుయా ఆసుపత్రిలో విధి నిర్వహణలో ఉన్న స్టాఫ్ నర్సుపై సోమవారం రోగి బంధువులు దాడి చేయడాన్ని ఏపీ ప్రభుత్వ కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ స్టాఫ్ నర్సుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు జి.దయామణి ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా పటిష్ఠమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



ఉండికి చేరిన కేవీకే స్వర్ణోత్సవ జ్యోతి యాత్ర

కేవీకేల్లో స్వర్ణోత్సవ జ్యోతి యాత్ర

మాజీ రిజిస్ట్రార్ డాక్టర్ జగన్నాథరాజు

ఉండి, జూలై 8: కృషి విజ్ఞాన కేంద్రాలు స్థాపించి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా దేశంలోని అన్ని కేవీకేలు స్వర్ణోత్సవ జ్యోతి యాత్రు నిర్వహిస్తున్నట్లు ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం మాజీ రిజిస్ట్రార్ డాక్టర్ దండు జగన్నాథరాజు తెలిపారు. ఉండి కృషి విజ్ఞాన కేంద్రానికి సోమవారం స్వర్ణోత్సవ జ్యోతి చేరుకుంది. కేవీకే హెడ్ డాక్టర్ మల్లికార్జునరావు అధ్యక్షతన వరి విత్తనోత్పత్తి ప్రకృతి వ్యవసాయం ప్రధానాంశంగా రైతు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన జగన్నాథరాజు మాట్లాడుతూ 1974 మార్చి 21న పుదుచ్చేరిలో తొలి కృషి విజ్ఞాన కేంద్రాన్ని స్థాపించారన్నారు. రెండు రోజులు ఇక్కడే స్వర్ణోత్సవ జ్యోతి ఉంటుందన్నారు. 9న వీరవాసరం మండల మత్స్యపురికి, 10న ఉండి నుంచి ఘంటశాల కేవీకేకు వెళ్తుందన్నారు. మాజీ అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ కె.సూర్యనారాయణ మాట్లాడుతూ ఉండి కేవీకే గతంలో చౌడు భూమిగా ఉండేదని దానిని సారవంతమైన భూమిగా మార్చినట్లు తెలిపారు. రైతులు ఇందుకూరి హరిబాబు, చల్లారావు, శ్రీనివాసరావు, తోట వెంకట నరసింహరావు, రవిరాజు, లక్ష్మీనారాయణ తదితరులు మాట్లాడారు. శాస్త్రవేత్తలు కె.విజయ్‌కుమార్, డాక్టర్ ఎన్‌డీ బోరా మెసియానా, డాక్టర్ ఎ.శ్రీనివాసరావు, రజిత పాల్గొన్నారు. ఉండి, ఆకివీడు, కాళ్ల, పాలకోడేరు, భీమవరం, వీరవాసరం తదితర గ్రామాల నుంచి రైతులు హాజరయ్యారు.



డీజీపీ ద్వారకా తిరుమలరావుకు వినతిపత్రం అందిస్తున్న పోలీస్ అధికారుల సంఘ నాయకులు

పోలీసులను తిరిగి పంపండి

ఎన్నికల బదిలీలపై డీజీపీకి వినతి

ఏలూరు క్రైం, జూలై 8 : సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఒక జిల్లా నుంచి మరో జిల్లాకు బదిలీ అయిన సివిల్ ఏఆర్ ఏపీఎస్పీకి చెందిన సీఐ, ఎస్ఐ, ఆర్ఎస్ఐలను తిరిగి వారి వారి జిల్లాలకు బదిలీ చేయాలని కోరుతూ రాష్ట్ర పోలీస్ అధికారుల సంఘం నాయకులతో కలిసి జిల్లా పోలీసు అధికారుల సంఘ అధ్యక్షుడు ఆర్.నాగేశ్వరరావు సోమవారం రాత్రి రాష్ట్ర డీజీపీ ద్వారకా తిరుమలరావుకు ఒక వినతి పత్రాన్ని అందజేశారు. సార్వత్రిక ఎన్నికలు మే 13న జరిగిన నేపథ్యంలో ఫిబ్రవరిలోనే ఏలూరు రేంజ్ పరిధిలోని పలువురు అధికారులను వారు పనిచేస్తున్న జిల్లా నుంచి మరో జిల్లాకు బదిలీ చేశారన్నారు. ఎన్నికల అనంతరం తిరిగి వారి జిల్లాలకే తిరిగి బదిలీలు జరుగుతాయని ఉన్నతాధికారులు తెలిపారని పేర్కొన్నారు. ఎన్నికల నియమావళి జూన్ ఆరుతో ముగిసిందన్నారు. అప్పటి నుంచి బదిలీ అయిన అధికారులు తమ జిల్లాకు వెళ్ళే నిమిత్తం బదిలీ కోసం ఎదురు చూస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో వారి సమస్యలను పోలీసు అధికారుల సంఘ నాయకులు డీజీపీ దృష్టికి తీసుకువెళ్ళారు. వారం రోజుల్లోగా బదిలీలు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని ద్వారకాతిరుమలరావు హామీ ఇచ్చారని ఏలూరు జిల్లా పోలీసు అధికారుల సంఘ అధ్యక్షుడు ఆర్.నాగేశ్వరరావు తెలిపారు.

నిబంధనల మేరకే సమస్యల పరిష్కారం




డీఎంహెచ్‌వోను కలిసిన సంఘ నాయకులు

ఏలూరు అర్బన్, జూలై 8 : వైద్య ఆరోగ్య శాఖలో ఉద్యోగులుందరూ ప్రభుత్వ నిబంధనల మేరకు పని చేయాల్సిందేనని, ఏవైనా సమస్య ఉంటే నేరుగా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరించే ప్రయత్నం చేస్తానని డీఎంహెచ్‌వో డాక్టర్ శర్మిష్ట హామీ ఇచ్చారు. ఏపీ వైద్య ఉద్యోగుల సంఘం రాష్ట్ర, జిల్లా శాఖ నాయకులు సోమవారం డీఎంహెచ్‌వోను కలిసి పలు సమస్యలపై చర్చించారు. ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్ జారీ చేసే ఉత్తర్వులను జిల్లాలో నూరు శాతం అమలు చేయాల్సిన బాధ్యత తనపై ఉందన్నారు. ఈ క్రమంలో కొందరు ఉద్యోగులకు ఇబ్బందులు తలెత్తవచ్చు నన్నారు. సంఘ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ విల్సన్‌బాబు, జిల్లా కార్యదర్శి గోవిందరావు, జిల్లా అధ్యక్షుడు అప్పారావు, నాయకులు విజయవర్ధన్ బాబు, నాగరాజు, బేబీ, రవీంద్రబాబు, ఏడుకొండలు, విజయశ్యామల, విజయమేరీ పాల్గొన్నారు.

అక్రమ బదిలీలపై ఫిర్యాదు

జిల్లాలోని అర్బన్ పీహెచ్‌సీల్లో వైద్య సిబ్బందిని నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా బదిలీ చేశారని ఆరోపిస్తూ కలెక్టరేట్ గ్రీవెన్స్ సెల్‌లో జిల్లా రెవెన్యూ అధికారిణికి ఫిర్యాదు చేసినట్టు చింతలపూడి యూపీ హెచ్‌సీ స్టాఫ్ నర్సు(మేల్) ఆర్.గంగాధర్ తెలిపారు.

జాబ్‌మేళాకు భారీ స్పందన



జాబ్ మేళాలో మాట్లాడుతున్న శ్రీనివాసరాజు

ఉండి, జూలై 8: ప్రధాన మంత్రి నేషనల్ అప్రెంటీస్ జాబ్ మేళాకు వివిధ ఐటీఐలలో కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులు హాజరయ్యారని ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరాజు తెలిపారు. ఉండి మండలం ఎన్ఆర్‌పీ అగ్రహారం ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థలో సోమవారం అప్రెంటీస్ జాబ్ మేళా నిర్వహించారు. 11 కంపెనీలు హాజరయ్యాయి. 206 మంది ఐటీఐ కోర్సు పూర్తి చేసిన వారు విచ్చేసినట్లు తెలిపారు. వీరిని మెరిట్ ప్రాతిపదికగా ఎంపిక చేస్తారన్నారు. ఇంటర్ ఒకేషనల్ కళాశాలకు చెందిన ప్రిన్సిపాల్స్, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళతో అసభ్యప్రవర్తన

ఆరు నెలల జైలు.. ఐదు వేల జరిమానా

చింతలపూడి, జూలై 8: ఒక మహిళతో అసభ్యప్రవర్తించిన కేసులో నేరం రుజువు కావడంతో పెరుమాళ్ళ సువర్ణరాజు అనే వ్యక్తికి ఆరు నెలల కఠిన కారాగార శిక్ష, రూ. ఐదు వేల జరిమానా విధిస్తూ స్థానిక జూనియర్ సివిల్ జడ్జి సి.మధుబాబు సోమవారం తీర్పు చెప్పారు. వివరాలివి.. చింతలపూడి మండలానికి చెందిన ఒక మహిళ చింతలపూడిలో ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లో పనిచేస్తూ ఉంటుంది. 2022, మే 22న స్కూటీపై వస్తుండగా, తుమ్మగూడెం వద్ద స్కూటీ చెడిపోవడంతో అక్కడ ఆపి బస్సు ఎక్కుదామని చూస్తుండగా, అదే గ్రామానికి చెందిన సువర్ణరాజు మోటారు సైకిల్‌పై వస్తూ తాను లిఫ్ట్ ఇస్తానని ఎక్కించుకున్నాడు. రేచర్ల వద్ద బైక్ ఆపి పక్కన ఉన్న పామాయిల్ తోటలోకి తీసుకువెళ్లి అసభ్యంగా ప్రవర్తించంతో ఆమె చింతలపూడి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అప్పటి ఎస్ఐ పి.చెన్నారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. కోర్టులో చార్జ్‌షీట్ ప్రవేశపెట్టగా వాదోపవాదాలు విన్న జూనియర్ సివిల్ జడ్జి మధుబాబు, ముద్దాయికి పైవిధంగా తీర్పు చెప్పారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పి.సామయ్య వ్యవహరించగా, సీఐ ఎం.సుధాకర్ పర్యవేక్షణలో ఎస్ఐ కుటుంబరావు సాక్షులను ప్రవేశపెట్టగా కోర్టు కానిస్టేబుల్ భగవాన్ సహకరించారు.


మీకోసం కార్యక్రమంలో అర్జీలు పరిశీలిస్తున్న జేసీ లావణ్యవేణి

కలెక్టరేట్‌లో మీకోసం.. 234 అర్జీలు స్వీకరణ

ఏలూరు రూరల్, జూలై 8: కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (మీకోసం)లో అధికారులకు 234 అర్జీలు అందాయి. సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ పి.లావణ్యవేణి అధికారులకు సూచించారు. జేసీతో పాటు డీఆర్వో టి.పుష్పమణి, డీఆర్‌డీఏ పీడీ ఆర్.విజయ్ రాజు, డిప్యూటీ కలెక్టర్లు భాస్కరరావు, ముక్కంటి, ఆర్డీవో కె.ఖాజావలి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. సంబంధిత అధికారులు నిర్దేశిత కాలపరిమితిలో సంతృప్తికరమైన పరిష్కారాలు అందించాలన్నారు. రేషన్‌కార్డు ద్వారా అందిస్తున్న బియ్యాన్ని వేగంగా పంపిణీ చేయాలని అధికారులను ఆదేశించారు.

తమ భూమిని ఆక్రమించుకుని భూమిలోకి రాకుండా దౌర్జన్యం చేస్తున్నారని, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మండవల్లి మండలం ఉనికిలి గ్రామానికి చెందిన లక్ష్మీనారాయణ అర్జీ అందజేశారు. తన భూమి వేరే వారిపేరుమీద ఆన్‌లైన్‌లో నమోదైందని, సరి చేయాలని పెదవేగి మండలం నడిపల్లి గ్రామానికి చెందిన దుర్గారావు అర్జీ అందజేశారు. తమ పంట కొబ్బరి, నిమ్మ పంటల మధ్య నుంచి విద్యుత్‌లైన్ అనుమతి లేకుండా వేశారని, తమకు నష్టపరిహారం ఇప్పించాలంటూ ద్వారకాతిరుమల మండలం హెచ్.లింగపాలెంకు చెందిన శ్రీనివాసరావు కోరారు.

ఉచిత సీట్లకు ఫీజు వసూలు చేస్తున్నారు

ఏలూరు అర్బన్: ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో 25శాతం సీట్లను పేద, బలహీనవర్గాల కుటుంబాల పిల్లలకు ఉచితంగా కేటాయించాలన్న ఉత్తర్వులను అమలుచేయని విద్యాసంస్థల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో జేసీకి పీడీఎస్‌యూ నాయకులు అర్జీ అందజేశారు. ఉచిత సీట్లకు ఫీజులు చెల్లించాలని పాఠశాలల యాజమాన్యాలు తల్లిదండ్రులపై ఒత్తిడి చేస్తున్నాయని ఆరోపించారు. భవిష్యత్‌లో విద్యార్థుల తల్లిదండ్రులను సమీకరించి ఉద్యమిస్తామన్నారు. జేసీని కలిసిన సంఘ నాయకుల్లో సంఘ జిల్లా అధ్యక్షుడు కె.నాని, క్రాంతి, సునీల్, తదితరులున్నారు.

● జంగారెడ్డిగూడెం: ఆర్డీవో కార్యాలయంలో 9 అర్జీలు స్వీకరించినట్లు ఏవో ఎం.సోమేశ్వరరావు తెలిపారు. జీలుగుమిల్లి మండలం దర్భగూడెంకు చెందిన సమితి వెంకటేశ్వరరావుకు ప్రభుత్వం ఇచ్చిన రెండు సెంట్ల భూమికి పట్టా ఇవ్వాలని కోరారు. మండలంలోని కేతవరం గ్రామానికి చెందిన వామిశెట్టి మణెమ్మ వృద్ధాప్య పింఛను కోసం అర్జీ ఇచ్చారు. మున్సిపల్ కార్మికులకు ఈఎస్‌ఐ డిస్పెన్సరీ ఏర్పాటు చేయాలని బి.బాలరాజు కోరారు.

అంగన్వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం అందించాలి : కలెక్టర్


అంగన్వాడీలో చిన్నారులతో కలెక్టర్

కుక్కునూరు, జూలై 8: అంగన్వాడీ కేంద్రాల్లో నిర్దేశిత మెనూ కచ్చితంగా అమలు చేసి, మంచి పౌష్టికాహారం అందించాలని జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. దామరచర్ల అంగన్వాడీ కేంద్రాన్ని సోమవారం ఆమె తనిఖీ చేశారు. పిల్లలకు అందిస్తున్న ఆహారం పరిశీలించి స్వయంగా రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. మెనూ ప్రకారం భోజనం అందించకపోతే సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. ఎల్లప్పగూడెం గ్రామానికి చెందిన ప్రజలు తమ గ్రామం ఏటా గోదావరి వరదలో మునుగుతున్నప్పటికీ పునరావాస ముంపు జాబితాలో లేదన్నారు. వరదల వలన ఇళ్లు ఖాళీ చేసి రహదారి పక్కన గుడిసెలు వేసుకుని జీవిస్తున్నామని కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. గ్రామాన్ని ముంపుజాబితాలో చేర్చాలని గిరిజనులు కోరారు.

వైసీపీ నాయకుల ఆక్రమణలపై విచారణ చేయాలి



రామకృష్ణ గీతాశ్రమ నిర్వాహకురాలు స్వరాజ్యలక్ష్మి

పోలవరం జూలై 8: పట్టిసీమ ఫెర్రీ రేవులో ప్రభుత్వ భూములు ఆక్రమించి దొడ్డిదారినరిజిస్ట్రేషన్ చేయించుకున్న వైసీపీ నాయకులపై విచారణ చేయాలని రామకృష్ణ గీతాశ్రమ నిర్వాహకురాలు నందుల స్వరాజ్యలక్ష్మి కోరారు. సోమవారం రామకృష్ణ గీతాశ్రమంలో ఆమె మాట్లాడుతూ 60 ఏళ్లుగా ఆశ్రమం నిర్వహిస్తున్నానన్నారు. వైసీపీ మండల నాయకుడి ప్రోద్బలంతో స్థానిక నాయకులు ఆశ్రమం చుట్టూ ఉన్న ప్రభుత్వ భూములు ఆక్రమించి ఫెన్సింగ్ వేశారని, ఆశ్రమానికి కనీస మార్గం లేకుండా చేశారన్నారు. 60 ఏళ్ళుగా లేని పట్టాలు, రిజిస్ట్రేషన్లు వారికి ఎలా వచ్చాయని ప్రశ్నించారు. అధికారులు వైసీపీ నాయకులతో కుమ్మక్కై అక్రమంగా రిజిస్ట్రేషన్ చేశారని ఆరోపించారు. రాకపోకలు సాగించడానికి మార్గం లేక అనారోగ్యంతో 20 రోజులుగా ఆశ్రమంలో నిర్బంధంలో ఉన్నానని, ఈ విషయంపై ప్రజా సమస్యలు పరిష్కారాలు కార్యక్రమానికి కలెక్టర్‌కు వాట్సాప్ ద్వారా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

బెదిరింపులకు పాల్పడుతున్న వారిని శిక్షించాలి

ఏలూరు రూరల్, జూలై 8: లింగపాలెం మండలం అన్నపనేనివారిగూడెం రెవెన్యూ గ్రామంలో రిజిస్ట్రేషన్ దారిలో నడవకుండా ప్రభుత్వ పుంతను ఆక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద సోమవారం ఆందోళన నిర్వహించారు. జిల్లా కార్యదర్శి టి.ప్రకాష్ మాట్లాడుతూ అన్నపనేనివారిగూడెంలో ప్రభుత్వ భూమిని నలుగురు వ్యక్తులు ఆక్రమించారని, ఆ దారివైపు వెళ్లకుండా బెదిరిస్తున్నారని ఆరోపించారు. తక్షణం సర్వే చేయించి, పుంత భూమిని విడగొట్టాలని బెదిరించిన వ్యక్తులను చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం జేసిని కలిసి వినతిపత్రం అందించారు. ఏఐకెఎంఎస్ జిల్లా సహాయ కార్యదర్శి కె.శంకర్‌రావు, సుముద్రాల సుందర్‌రావు, ఏసుపాదం, పార్టీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

పీఎం విశ్వకర్మ యోజన రుణాలు మంజూరు చేయాలి

ఏలూరు రూరల్, జూలై 8: ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన ద్వారా దరఖాస్తు చేసుకున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ లబ్ధిదారులకు శిక్షణ ఇచ్చి తక్షణం రుణాలు మంజూరు చేయాలని దళితసేన వ్యవస్థాపక అధ్యక్షుడు జుజ్జువరపు రవిప్రకాష్ విజ్ఞప్తి చేశారు. లబ్దిదారులతో కలసి సోమవారం కలెక్టరేట్ వద్ద నిరసన తెలియజేశారు. అనంతరం జేసీని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ పథకంలో అన్నివర్గాల మహిళలు, పురుషులు, దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లాలో శిక్షణ అందించడం సరికాదన్నారు. ఏలూరులోనే శిక్షణ అందించాలని ఈ పథకంలో దరఖాస్తు చేసుకున్న లబ్దిదారులతో కలసి నిరసన తెలియజేశారు.

ఎర్ర కాలువ మిగులు భూములు పేదలకు పంచాలి

టి.నరసాపురం, జూలై 8: ఎర్రకాలువ మిగులు భూములు పేదలకు పంచాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రాధాకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సాలిగూడెం, అబ్బుల్లాపురం, మల్లప్పగూడెం, అప్పలరాజుగూడెం గ్రామాల పేదలు ఎర్రకాలువ మిగులు భూములలో దుక్కిదున్ని వరి విత్తనాలు వేసే కార్యక్రమాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఎర్రకాలువ మిగులు భూములలో పేదలు, దళితులు, గిరిజనులు వారి హక్కుల కోసం పోరాడుతున్న వారిపై అక్రమ కేసులు పెట్టడం దారుణమన్నారు. మిగులు భూములు భూస్వాములకు కట్టబెట్టే విధంగా అధికారులు వ్యవహరించడం సరికాదన్నారు. భూస్వాముల కొమ్ముకాస్తున్న రెవెన్యూ, ఇరిగేషన్, పోలీసులపై ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలన్నారు.

రాష్ట్ర స్థాయి విద్యా, వైజ్ఞానిక శిక్షణ తరగతులు


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఏలూరు కార్పొరేషన్, జూలై 8: అన్నమయ్య జిల్లా మదనపల్లిలో ఈనెల 24, 25, 26 తేదీల్లో ఏపీ మునిసిపల్ వర్కర్స్ యూనియన్, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి విద్య, వైజ్ఞానిక శిక్షణ తరగతులు జరుగుతాయని జిల్లా ఉపాధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు తెలిపారు. సీపీఐ కార్యాలయంలో శిక్షణ తరగతులకు సంబంధించిన కరపత్రాలను సోమవారం ఆవిష్కరించారు. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జిల్లా నుంచి ఎంపిక చేసిన 16 మంది ప్రతినిధులు తరగతులకు హాజరవుతారన్నారు. నాయకులు డొడ్డిగర్ల నాగబాబు, బొక్కా శ్రీనివాసరావు, యలగాడ దుర్గారావు, ఎ.అప్పలరాజు, నారాయణరావు, కె.లోమి, కడుపు కన్నయ్య, యలాగడ శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మొహరం వేడుకలు ప్రారంభం

ఏలూరు రూరల్, జూలై 8: నగరంలోని మెయిన్ బజారు హజరత్ మౌలాలి ఆస్థానాలో మోహరం, పీర్ల పండుగ, వేడుకలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈనెల 17 వరకు వేడుకలు నిర్వహిస్తారు. ఎమ్మెల్యే బడేటి చంటి దర్గాను సందర్శించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కుల,మతాలకు అతీతంగా ప్రతిఒక్కరూ సమైక్యతతో జీవించాలన్నారు. పీర్ల పంజా కమిటీ గౌరవ అధ్యక్షుడు ఎస్.కె రాజా అహ్మద్, ఇబ్రహీం బేగ్, అధ్యక్షుడు ఎం.బీ గాలబ్‌ఆలీ, గాజుల బాజి పాల్గొన్నారు.


కొవ్వాడ కాలువ అవుట్‌ఫాల్ స్లూయిస్‌లో నీటి ఉధృతి (ఇన్‌సెట్) కడెమ్మ స్లూయిజ్ వద్ద జలాలు

పొంగిన కొండ వాగులు

కడెమ్మ, కొవ్వాడ అవుట్ ఫాల్ స్లూయిస్‌ల నుంచి నీరు విడుదల

పోలవరం జూలై 8: పోలవరం, ఎగువన కురిసిన వర్షానికి ఏజన్సీ గ్రామాల కొండవాగులు, కొవ్వాడ కాలువ, ఇసుక కాలువలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. కొవ్వాడ కాలువ, కొండవాగుల జలాలు సోమవారం కడెమ్మ స్లూయిస్, పట్టిసీమ కొవ్వాడ అవుట్‌ఫాల్ స్లూయిస్ నుంచి గోదావరిలోకి ప్రవహించాయి.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

వర్షాల సీజనులో గోదావరి వరదలు, కొండవాగుల ఉధృతి నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ పవన్ కుమార్ హెచ్చరించారు. కొండవాగులు దాటే సందర్భం, గోదావరి ప్రయాణాలు చేసే సందర్భాలలో అప్రమత్తంగా ఉండాలన్నారు. విద్యార్థులు, యువకులు స్నానాలకు ఉపక్రమించడం, సెల్ఫీల కోసం ప్రయత్నాలు చేయరాదని సూచించారు. వర్షాలు వరదల వలన వన్యప్రాణులు, పాములు జనావాసాల మధ్యకు వచ్చే అవకాశం ఉందన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి సమాచారం 9440796664 సెల్ నెంబరుకు తెలియజేయాలన్నారు.


వర్షాలకు రోడ్లపై చేరిన నీటిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చంటి


జంగారెడ్డిగూడెంలో కొత్త బస్సులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రోషన్


కుక్కునూరులో ఎమ్మెల్యే చిర్రి బాలరాజు విజయోత్సవ ర్యాలీ

ఏలూరులో రహదారుల నిర్మాణం బాధ్యత తీసుకుంటాం

గత ప్రభుత్వ తీరుపై ఎమ్మెల్యే చంటి ఆగ్రహం

ఏలూరు టూటౌన్, జూలై 8: వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యంతో నగరంలో అభివృద్ధి కుంటుపడిందని, రోడ్లన్ని గుంతలమయంగా తయారయ్యాయని ఎమ్మెల్యే బడేటి చంటి ఆగ్రహం వ్యక్తం చేశారు. రహదారులు అభివృద్ధి చేసే బాధ్యత తమ ప్రభుత్వం తీసుకుంటుందని ఆయన అన్నారు. నగరంలో సమస్యలను స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తేవడంతో సోమవారం తెల్లవారు జామున రోడ్లను పరిశీలించారు. వర్షం, డ్రెయినేజీ నీటితో రోడ్లన్నీ నీటిమయం కావడంతో గత వైసీపీ ప్రభుత్వ తీరును ఎండగట్టారు. త్వరలోనే రోడ్లన్నింటిని బాగు చేస్తామన్నారు. పారిశుధ్య నిర్వహణపై అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని అధికారులను హెచ్చరించారు. వర్షాకాలం ముగిసిన వెంటనే రోడ్ల మరమ్మతు పనులు చేపడతామని, ఈలోగా ప్రజలకు ఇబ్బందులు కలగకుండా కచ్చా డ్రెయిన్లు, కల్వర్టుల నిర్మాణం చేపట్టాలని నగరపాలక సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట ఎంహెచ్‌ఓ రెడ్డి మాలతి, చోడే వెంకటరత్నం, కోఆప్షన్‌సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, ఆర్నేపల్లి తిరుపతి, చోడే బాలు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

ఇసుక ఉచితంగా ఇస్తామని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. ఉచితంగా ఇసుక ఇవ్వడం వలన పేద, మధ్య తరగతి ప్రజలు ఇళ్లు నిర్మించుకోవడానికి వీలవుతుందన్నారు. త్వరలోనే మద్యంపాలసీని తీసుకొస్తామన్నారు.

ఆర్టీసీని అభివృద్ధిపథంలో నడిపిస్తా : ఎమ్మెల్యే రోషన్

జంగారెడ్డిగూడెం: ఆర్టీసీ డిపో అభివృద్ధి పథంలోకి నడిపించడమే తన లక్ష్యమని ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ అన్నారు. ఆర్టీసీ డిపోకు వచ్చిన మూడు కొత్త బస్సులను ఎమ్మెల్యే సోమవారం ప్రారంభించారు. రెండు నాన్ ఏసి స్లీపర్ కోచ్‌లు హైదరాబాద్, మరో ఏసీ కోచ్ బస్సు వైజాగ్ నడపనున్నట్లు తెలిపారు. జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు మేకా ఈశ్వరయ్య, మండవ లక్ష్మణరావు, కొప్పాక శ్రీనివాసరావును ఆర్టీసీ అధికారులతో కలసి జంగారెడ్డిగూడెం డిపో అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ఆర్టీసీ ఆర్ఎం వరప్రసాద్ మాట్లాడుతూ ఖర్చు తగ్గించి ఆదాయం పెంచుకునేవిధంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. బస్టాండ్‌లోని దుకాణాల్లో ధరలపై ఎమ్మెల్యే రోషన్‌కుమార్ ఆరా తీశారు. ఎంఆర్‌పి కంటే అదనంగా అమ్మితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆర్టీసీ డీఎం గంగాధరరావు, పెనుమర్తి రామకుమార్, రావూరి కృష్ణ, పరిమి సత్తిపండు, అబ్బిన దత్తాత్రేయ, తూటిగుంట రాము, గుమ్మడి ప్రసాద్, శ్రీధర్, కిషోర్, ఉక్కుర్తి సీతారామ్, తాతాజీ, పీరు తదితరులు పాల్గొన్నారు.

కుక్కునూరులో ఎమ్మెల్యే బాలరాజు విజయోత్సవ ర్యాలీ

కుక్కునూరు: పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు కుక్కునూరులో సోమవారం విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. రామాలయం వద్ద కూటమి నాయకులు చిర్రి బాలరాజుకు ఘనస్వాగతం పలికారు. అనంతరం రామాలయం వద్ద ప్రత్యేక పూజలు చేసి దాదాపు 2వేల మంది 50కార్లతో ర్యాలీ నిర్వహించారు. ప్రధాన రహదారి వద్ద అభిమానులు పూలవర్షం కురిపించారు. ఎన్నికల్లో కష్టపడిన ప్రతీ కార్యకర్తకు ఎమ్మెల్యే అభినందనలు తెలిపారు. టీడీపీ మండల అధ్యక్షుడు ములిశెట్టి నాగేశ్వరరావు, జనసేన మండల అధ్యక్షుడు ఎం.యుగంధర్, ఉప సర్పంచ్ పిచ్చుక రాజు, మంత్రి గోపాలకృష్ణ, ఎం.వెంకన్నబాబు, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యం నిర్వహణపై అప్రమత్తంగా ఉండాలి


డ్రెయిన్లలో పూడిక తొలగిస్తున్న కార్మికులు

కొయ్యలగూడెం, జూలై 8: పారిశుధ్యం నిర్వహణపై గ్రామ కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో అశోక్‌కుమార్ కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేశారు. వర్షాకాలం డ్రెయిన్లు పొంగిపొర్లుతున్నాయని, పూడిక తీయాలన్నారు. పారిశుధ్యంపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు. పరింపూడి పంచాయతీలో పారిశుధ్య పనులు చేయిస్తున్నట్లు తెలిపారు. ప్రత్యేక సిబ్బందితో డ్రైన్ల పూడికతీతలు చేయిస్తున్నామన్నారు.

మంత్రి సుభాష్‌ను కలసిన శెట్టిబలిజ నాయకులు


మంత్రితో గౌడ, శెట్టి బలిజ సంఘ నేతలు

ఉంగుటూరు, జూలై 8: అమరావతి వెళుతున్న కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌ను మార్గ మధ్యలో నారాయణపురం వద్ద పలువురు బీసీ నేతలు కలసి అభినందనలు తెలిపారు. చేబ్రోలు గ్రామ గౌడ, శెట్టిబలిజ సంక్షేమ సంఘ నాయకులు శీలం పల్లేశ్వరరావు, ఉపాధ్యక్షులు మారిశెట్టి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి శీలబోయిన కిషోర్ మంత్రికి శాలువా కప్పి, వేంకటేశ్వరస్వామి ప్రతిమను అందించారు. దొంగ లక్ష్మీనారాయణ, కముజు గంగాధరరావు, నేకూరి ఆశీర్వాదం పాల్గొన్నారు.

ముత్తారెడ్డిని పరామర్శించిన ఎంపీ మహేష్

చింతలపూడి, జూలై 8: టీడీపీ నియోజకవర్గ నాయకుడు జగ్గవరపు ముత్తారెడ్డిని ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ యాదవ్ హైదరాబాద్‌లోని ఆసుపత్రిలో పరామర్శించారు. ముత్తారెడ్డికి నాలుగు రోజుల క్రితం బైపాస్ ఆపరేషన్ జరిగింది. ఆయన ఆరోగ్య సమాచారాన్ని ఎంపీ అడిగి తెలుసుకున్నారు. దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ కూడా ముత్తారెడ్డిని హైదరాబాద్ ఆసుపత్రిలో పరామర్శించారు.

ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

ఏలూరు క్రైం, జూలై 8: ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని త్రి టౌన్ సీఐ కె శ్రీనివాసరావు హెచ్చరించారు. నగరంలో మైనర్లు మోటారు సైకిళ్లు నడపడాన్ని గమనించి వారిని పోలీస్ స్టేషన్‌కు తీసుకువెళ్ళారు. కౌన్సెలింగ్ ఇచ్చి తల్లి దండ్రులకు సమాచారం ఇచ్చారు. మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై కేసు నమోదు చేస్తామని సీఐ శ్రీనివాసరావు హెచ్చరించారు. ద్విచక్ర వాహనదారులు కచ్చితంగా హెల్మెట్ ధరించాలని తెలిపారు. వాహన రికార్డు, బీమా, డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉండాలని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే వారికి భారీ జరిమానాలు విధించడం జరుగుతుందని సూచించారు.

ప్రమాదాల నివారణ చర్యలు చేపట్టండి : చింతమనేని

పెదవేగి, జూలై 8: జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని జాతీయ రహదారి భద్రతా అధికారులకు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ సూచించారు. దెందులూరు నియోజకవర్గం పరిధిలో జాతీయ రహదారిని హైవే అధికారులతో కలసి సోమవారం పరిశీలించారు. గ్రామాల నుంచి హైవేకు వచ్చే దగ్గర అండర్‌పాస్, సర్వీస్‌రోడ్లు, కల్వర్టులు లేకపోవడంతో ప్రజలు ప్రమాదాల బారిన పడుతున్నారన్నారు. రహదారిలో లోపాలను సరిదిద్దే చర్యలు చేపట్టామని ఆయన పేర్కొన్నారు. ఎక్కడెక్కడ, ఎలాంటి చర్యలు తీసుకోవాలి, డిజైన్ల మార్పులు, చేర్పులపై చర్చించారు. దీనిపై సత్వరమే చర్యలు చేపట్టి, ప్రజల ప్రాణాలను కాపాడాలని ప్రభాకర్, అధికారులకు సూచించారు.

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి


వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ కృష్ణకిశోర్

లింగపాలెం, జూలై 8: ప్రజలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని, అనారోగ్య సమస్యలు ఎదురైతే వెంటనే వైద్య సిబ్బందిని సంప్రదించాలని కె.గోకవరం పీహెచ్‌సీ డాక్టర్ కృష్ణకిశోర్ సూచించారు. కె.గోకవరంలో సోమవారం వైద్యశిబిరం నిర్వహించారు. అనంతరం గ్రామాల్లో పారిశుధ్యం పరిశీలించారు. గ్రామాల్లో ప్రతిఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వైద్య సిబ్బంది గ్రామాల్లో పర్యటించాలని, మురుగునీటి గుంతల్లో ఆయిల్‌బాల్స్ వేయాలని, ప్రతిరోజూ ఇంటింటికి తిరిగి గ్రామస్తుల ఆరోగ్య పరిస్థితులను తెలుసుకోవాలన్నారు. వైద్య సహాయం అవసరమైన వారిని వెంటనే ఆసుపత్రికి తీసుకురావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు పలువురు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కౌలు రైతు కార్డులు సద్వినియోగం చేసుకోవాలి


సిబ్బందికి సూచనలు ఇస్తున్న తహసీల్దార్

నిడమర్రు జూలై 8: అర్హులైన ప్రతి రైతు కౌలు రైతు కార్డు పొంది ప్రభుత్వ సదుపాయాలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ కె.పోసిబాబు అన్నారు. వ్యవసాయ, రెవెన్యూ సిబ్బందికి సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏవో ఎస్.గీతాదేవి మాట్లాడుతూ కౌలు రైతు కార్డుల కోసం రైతులు సమీప సచివాలయం, రైతు భరోసా కేంద్రాలను సంప్రదించాలన్నారు. పంట, గ్రూపు రుణాలు, ఇన్‌పుట్ సబ్సిడీ, బీమా, పంట నమోదుతో లబ్ధి పొందవచ్చన్నారు. సిబ్బంది యు.జ్యోతి, ప్రసాద్, డీటీ శేఖర్, ఆర్ఐ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు మౌలిక సౌకర్యాలు కల్పించాలి

బుట్టాయగూడెం, జూలై 8: ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు నిర్మించుకుని నివాసం ఉంటున్న గిరిజనులకు విద్యుత్, రోడ్లు, మంచినీరు సౌకర్యాలు కల్పించాలని కోరుతూ సోమవారం ఎమ్మెల్యే చిర్రి బాలరాజును కలసి వినతిపత్రం అందజేశారు. కమిటీ నాయకుడు తెల్లం రామకృష్ణ మాట్లాడుతూ బుట్టాయగూడెం మండల కేంద్రంలో ప్రభుత్వ స్థలంలో ఇళ్లు నిర్మించుకుని నివాసం ఉంటున్న వారు కనీస సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు తెల్లం వెంకటలక్ష్మి, మంగరాజు, మరియమ్మ, చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

కొత్తపేటలో కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభం

కామవరపుకోట, జూలై 8: తపన ఫౌండేషన్ ఆధ్వర్యంలో కొత్తపేట రామాలయం వద్ద కుట్టు శిక్షణ కేంద్రాన్ని టీడీపీ మండల అధ్యక్షుడు కిలారు సత్యనారాయణ, బీజేపీ నాయకులు కాకి చంటి, రామలక్ష్మి ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల్లోని మహిళల స్వయం ఉపాధికి గారపాటి చౌదరి శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేశారన్నారు. బొబ్బిలి వీరబాబు, ఘంటా గోపి, సురేష్, చెలికాని భాస్కరరావు, ఎం.సత్యనారాయణ, భాను, యుగంధర్, వీరమళ్ళ మధు, తానంకి గణేష్, లక్ష్మీనారాయణ, నాగబాబు, శిక్షకురాలు బలుసు లక్ష్మి, గుల్లా నాగేశ్వరరావు, ఉమ్మడి ప్రభావతి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

10న కోర్కెల సాధన దినం

పోలవరం జూలై 10: ఈనెల 10న డిమాండ్స్ డే విజయవంతం చేయాలని అంగన్వాడీ వర్కర్స్ మండల నేత పీఎల్ఎస్ కుమారి పిలుపునిచ్చారు. సోమవారం ఆమె మాట్లాడుతూ అంగన్వాడీల కోర్కెల సాధన కోసం జరిగే కార్యక్రమంలో కార్యకర్తలు, ఆయాలు పాల్గొనాలని ఆమె కోరారు.

మాజీ ముఖ్యమంత్రి వైఎస్‌కు నేతల నివాళి



వైఎస్ చిత్రపటం వద్ద మాజీ ఎమ్మెల్యే నివాళి

చింతలపూడి, జూలై 8: స్థానిక కాంగ్రెస్ కార్యాలయంలో దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి సందర్భంగా సోమవారం పలువురు నేతలు నివాళులర్పించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు విస్సంపల్లి సుందరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా వైఎస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పరిపాలన కాలంలో ఆయన అందించిన సేవలు, పథకాలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కొనకళ్ళ కృష్ణమూర్తి, బోసురెడ్డి, సుబ్బారావు, సంకుప్రసాద్, పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

భీమడోలులో..


వైఎస్ చిత్రపటం వద్ద నేతల నివాళి

భీమడోలు: మండలంలోని పలు ప్రాంతాల్లో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు యర్రంశెట్టి ఏడు కొండలు ఆధ్వర్యంలో సంత మార్కెట్‌లో రాజశేఖరరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉమ్మడి రాష్ట్రానికి ఆయన అందించిన సేవలను గుర్తు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఇంజేటి అచ్చుతం తదితరులు పాల్గొన్నారు.

● పెదవేగి: వైఎస్.రాజశేఖర్‌రెడ్డి జయంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ముండూరులో కాంగ్రెస్‌పార్టీ నాయకుడు ఆలపాటి నరసింహమూర్తి ఆధ్వర్యంలో వైఎస్‌కు నివాళుల్పించారు. పెదవేగి, కూచింపూడి, వేగివాడ తదితర గ్రామాల్లో వైఎస్ విగ్రహాలకు పూలమాలలు వేశారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వినికిడి యంత్రాల పంపిణీ

ఏలూరు కార్పొరేషన్, జూలై 8: లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పలువురికి వినికిడి యంత్రాలను ఎమ్మెల్యే బడేటి చంటి, లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ మానేపల్లి రామారావు సోమవారం అందజేశారు. ఎమ్మెల్యే చంటి మాట్లాడుతూ సేవా కార్యక్రమాలు చేయడంలో లయన్స్‌క్లబ్ ప్రథమ స్థానంలో ఉందన్నారు. వైద్య ఆరోగ్య సేవలు అందచేయడం వలన అందరికీ విస్తృత సేవలు అందుతున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా లయన్స్ గవర్నర్ కాకరాల వేణుబాబు, ఎమ్మెల్సీ వంక రవీంద్ర, రీజనల్ చైర్మన్ ఉడత రత్నకుమార్, జోన్ చైర్మన్ పిచికల లక్ష్మీనారాయణ, వేమా కోటేశ్వరరావు, ఎం.చలపతిరావు, కంది బాలకృష్ణ, తమ్మన సుహాస్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం..

- **ఏలూరు అర్బన్ :** యుటీఎఫ్ ఏలూరు నగరశాఖ స్వర్ణోత్సవాల సందర్భంగా మున్సిపల్ పాఠశాలల్లో సంఘ సభ్యత్వ కార్యక్రమాన్ని నిర్వహించారు. రవికుమార్, శివశంకరరావు, చిట్టిబాబు, పర్వీన్‌బేగం, అప్పారావు, రాజారావు, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.
- **ఏలూరు రూరల్ :** పవర్‌పేట హిందినీకేతన్ వజ్రోత్సవాల సందర్భంగా 8, 9, 10 తరగతుల విద్యార్థులకు 13న హిందీ పద్య పఠన పోటీలు నిర్వహిస్తున్నట్లు కార్యదర్శి పి.కవితాకుమారి తెలిపారు. విద్యార్థులు ఈనెల 11వ తేదీలోగా పేర్లు నమోదు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. 9440343295నెంబర్‌లో సంప్రదించవలసిందిగా విజ్ఞప్తి చేశారు.
- **ఏలూరు కార్పొరేషన్ :** సత్రంపాడు అంబికాదేవి ఆలయ ప్రాంగణంలో వారాహి నవరాత్రి మహోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. అమ్మవారిని ప్రత్యేక అలంకరణలతో దర్శనం కలుగజేశారు. ప్రతీరోజూ శ్రీచక్ర అభిషేకం, చండీ మూలమంత్ర జపం నిర్వహిస్తున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు వారణాసి రాఘవేంద్రశర్మ భక్తులతో వారాహి నవరాత్రి మహోత్సవాల్లో ప్రత్యేక పూజలు చేయిస్తున్నారు.
- **కామవరపుకోట :** ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందా కృష్ణమాదిగ జన్మదిన వేడుకలను వీరిశెట్టిగూడెంలో నిర్వహించారు. భారతాల రమేష్‌మాదిగ వృద్ధులు, మహిళలకు దుప్పట్లు, చీరలు పంపిణీ చేశారు. జొన్నకూటి నాగేంద్రరావు, తనకడ ముక్కయ్య, కొండపల్లి నాగేంద్ర, ప్రొద్దుటూరి వీరాంజనేయులు, కొండెల్లి రమేష్ పాల్గొన్నారు.
- **లింగపాలెం :** యడవల్లి గ్రామానికి చెందిన కొమ్ము వెంకటేశ్వరమ్మ ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండటంతో ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ సతీమణి సొంగా విజయ స్పందించారు. గుంటూరు హాస్పిటల్ డాక్టర్స్‌తో మాట్లాడి వైద్య సదుపాయం కల్పించారు. రూ.5వేలు ఆర్థిక సాయం అందజేశారు. అట్లూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.
- **లింగపాలెం :** మండలం నుంచి పలువురు బీజేపీ నేతలు రాజమండ్రిలో జరుగుతున్న బీజేపీ ఆంధ్రప్రదేశ్ విస్తృతస్థాయి రాష్ట్ర కార్యవర్గ సమావేశానికి హాజరయ్యారు. రాయంకుల చక్రధర్‌రావు, కుర్రా సుబ్రహ్మణ్యేశ్వర వరప్రసాద్, పలువురు బీజేపీ నాయకులు తరలివెళ్ళారు.
- **దెందులూరు :** విద్యార్థులు చిన్నతనం నుంచి గురువులను గౌరవిస్తూ బాగా చదువుతూ సేవ గుణం కలిగి ఉండాలని, విద్య మాత్రమే మనిషిని ఉన్నత స్థానాలకు తీసుకుని వెళుతుందని డీఎస్పీ గొలి లక్ష్మయ్య అన్నారు. శ్రీరామవరం మండల పరిషత్ పాఠశాలను ఆయన పరిశీలించారు. అనంతరం విద్యార్థులకు నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. బాగా చదువుకుని మంచి స్థానాల్లోకి వెళ్లాలని కోరారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలసి మొక్కలను నాటారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయలు, విద్యార్థులు పాల్గొన్నారు.


జంగారెడ్డిగూడెంలో కూటమి నాయకులు, భవన నిర్మాణ కార్మికులు


ద్వారకా తిరుమలలో చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం

ప్రజలకు అందుబాటులో ఇసుక : ఎమ్మెల్యే బాలరాజు

కుక్కునూరు, జూలై 8: నూతన విధానంతో ఇసుక ప్రజలకు అందుబాటులోకి వచ్చిందని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అన్నారు. కలెక్టర్ వెట్రిసెల్వితో పాటు ఎమ్మెల్యే బాలరాజు సోమవారం వింజరం ఇసుక డిపోను సందర్శించారు. ప్రజల అవసరాలకు వింజరం, ఇబ్రహీంపేట ఇసుక డిపోల నుంచి ప్రభుత్వం నిర్దేశించిన రుసుం చెల్లించి ఇసుక పొందవచ్చని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఇసుక ప్రజలకు అందుబాటులో లేకుండా పోయిందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ప్రజల కోసం ఇసుకను అందుబాటులోకి తెచ్చామన్నారు.

భవన నిర్మాణ కార్మికుల హర్షం

జంగారెడ్డిగూడెం, జూలై 8: ఉచిత ఇసుక విధానంపై కూటమి నాయకులు, భవన నిర్మాణ కార్మికులు హర్షం వ్యక్తం చేశారు. టీడీపీ, జనసేన నాయకుల ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి కొల్లు రవీంద్ర, ఎంపి పుట్టా మహేష్ కుమార్, ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కేక్ కట్ చేసి కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. జి.శ్రీనివాస్, మాజీ సర్పంచ్ ఎస్.కృష్ణ, వెంకటస్వామి, ధర్మరాజు, వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

● ద్వారకా తిరుమల: చంద్రబాబు ప్రవేశపెట్టిన ఉచిత ఇసుక విధానం అన్ని వర్గాల వారికి ఆమోదయోగ్యంగా ఉందని పలువురు భవన నిర్మాణ కార్మికులు అన్నారు. ద్వారకాతిరుమలలో వారు టీడీపీ నేతలతో కలసి సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఇసుకను ఉచితం చేయడం వల్ల కార్మికులకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయన్నారు. ఇకపై సీనరేజీలు ఉండవని ప్రకటించడం హర్షణీయమన్నారు. ఈ విధానంతో కార్మికుల కష్టాలు పైదొలిగాయని సంతోషాన్ని వ్యక్తం చేశారు. భవన నిర్మాణ కార్మికులు బెజవాడ ఓంకార్, రవి, చిలకా రెడ్డి కూటమి నేతలు కూరాకుల బుజ్జి, ఇమ్మడి రత్నాజీ, గువ్వల మావుళ్ళ తదితరులు పాల్గొన్నారు.



చేపలు పట్టుబడి చేస్తున్న రైతులు

చేప రైతు పంట పండింది

కిలో శీలావతి ధర రూ.115

కలిదిండి, జూలై 8 : ఎట్టకేలకు తెల్ల చేపల ధర పెరగ డంతో ఆక్వా రైతులు ముమ్మరంగా చేపల పట్టుబడులు చేస్తున్నారు. కిలో శీలావతి ధర రూ.115 పలుకుతోంది. చాలాకాలంగా కిలో తెల్ల చేప ధర రూ.100 మాత్రమే ఉండడంతో చేపల రైతులు నష్టాల ఊబిలో కూరుకు పోయారు. చేపల మేతలకు ఉపయోగించే డీవోబీ తవుడు పది టన్నులు రూ.2 లక్షల నుంచి రూ.1.75 లక్షలకు తగ్గింది. దీంతో చేపల రైతులు లాభాల బాటలో పయనిస్తున్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో సుమారు 2 లక్షల ఎకరాల్లో చేపల సాగు చేస్తున్నారు. చేపలకు గిట్టుబాటు ధర లభించడంతో కిలో సైజు శీలావతి చేపలను అధికంగా పట్టుబడులు చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో చేపలు, రొయ్యలకు గిట్టుబాటు ధర లేక ఆక్వా రైతులు లక్షలాది రూపాయలు నష్టం వాటిల్లి అప్పుల ఊబిలో కూరుకుపోయారు. ఆక్వా రంగం తీవ్ర సంక్షోభం ఎదుర్కొంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లోనే చేపల ధరలు పెరగడం,డీవోబీ తవుడు ధర తగ్గడంతో చేపలకు గిట్టుబాటు ధర లభిస్తుందని ఆక్వా రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



చాట్రాయిలో వరినాట్లు వేస్తున్న బెంగాల్ కూలీలు

నాటేస్తే పంటే!

బెంగాల్, ఒడిశా కూలీలతో వరి నాట్లకు రైతుల మొగ్గు

చాట్రాయి, జూలై 8: మండలంలోని చాట్రాయి గ్రామంలో బెంగాల్, ఒడిశా నుంచి వచ్చిన కూలీలు వరినాట్లు వేస్తున్నారు. ఈ గ్రామంలో బోరుబావుల కింద రైతులు ముమ్మరంగా వరినాట్లు వేస్తుండటంతో కూలీలకు డిమాండ్ ఏర్పడింది. కొన్నేళ్లుగా ఖరీఫ్ సీజన్‌లో బెంగాల్, ఒడిశా నుంచి కూలీలు మండలానికి వస్తున్నారు. ఈ ఏడాది కూడా మండలానికి ఇప్పటి వరకు సుమారు 150 మంది కూలీలు వచ్చినట్లు, త్వరలో ఇంకా చాలా మంది రానున్నట్లు రైతులు చెబుతున్నారు. బెంగాల్, ఒడిశా కూలీలు వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనలకనుగుణంగా తాళ్ళతో వరసలు పట్టి వరినాట్లు వేస్తున్నారు. ఇలా నాట్లు వేయటం వల్ల మొక్కలకు గాలి, సూర్యరశ్మి అంది తెగుళ్ళ బెడద తగ్గటమే కాక పెద్ద దుబ్బులు చేసి అధిక దిగుబడులు వస్తున్నాయని రైతులు అంటున్నారు. దీంతో ఎక్కువ మంది రైతులు ఆ కూలీలతోనే నాట్లు వేయించటానికి మొగ్గుచూపుతున్నారు. ఎకరం భూమికి వరినారు తీసి నాట్లు వేసినందుకు రైతులు రూ. 4500 ఇస్తున్నారు. బెంగాల్, ఒడిశా కూలీలు 12 మంది ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు 3 నుంచి 4 ఎకరాలు వరినాట్లు వేస్తున్నారు. అదే మన కూలీలు 12 మంది ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఒక ఎకరం మాత్రమే నాట్లు వేయగలుగుతున్నారు. చాట్రాయిలో రైతులు తొలకరి రాగానే వరినార్లు పోసి ముందస్తుగా నాట్లు వేస్తుంటారు. పెద్ద వర్షాలు పడితే వారం, పది రోజుల్లో మండలంలోని అన్ని గ్రామాల్లో నాట్లు ప్రారంభం అయ్యే అవకాశం ఉంది. నెలన్నర పాటు ఈ ప్రాంతంలో ఉండి నాట్లు వేసి తమ రాష్ట్రాలకు వెళతామని బెంగాల్, ఒడిశా కూలీలు తెలిపారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పీహెచ్‌సీ ఆవరణను శుభ్రపరుస్తాం

ఎంపీడీవో దినతేజ్

కలిదిండి, జులై 8 : కలిదిండి పీహెచ్‌సీ ఆవరణ పరిశుభ్రతకు చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో దినతేజ్ తెలిపారు. రోగులకు పరీక్షే శీర్షికన సోమవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. పీహెచ్‌సీ ఆవరణలో నిల్వ ఉన్న నీరు, చెత్తాచెదారం తొలగిస్తామన్నారు. బ్లీచింగ్ చల్లించి పరిశుభ్రంగా ఉంచుతామన్నారు. ఆసుపత్రి ఆవరణలో చెత్తాచెదారం వేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. పీహెచ్‌సీకి ప్రహరీ నిర్మాణంపై సంబంధిత ఉన్నతాధికారులకు నివేదిక సమర్పిస్తామన్నారు.

మాంసం విక్రయిస్తే కఠిన చర్యలు



మాంసం దుకాణదారుడితో మాట్లాడుతున్న ఈవోపీఆర్డీ

ముసునూరు, జూలై 8: యథేచ్ఛగా మాంసం విక్రయాలు శీర్షికన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి పంచాయతీ అధికారులు స్పందిం చారు. సోమవారం ముసునూరులోని ఆరు మాంసం దుకాణదారులను ఈవోపీఆర్డీ ఎస్వీ శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి ఆరేపల్లి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో మండల పరిషత్ కార్యాలయానికి రప్పించి మాట్లాడారు. గ్రామంలో డెంగీ, డయేరియా కేసులు నమోదైన నేపథ్యంలో ప్రజల ఆరోగ్య రీత్యా నెల రోజులు వరకు మాంసం విక్రయాలు జరపవద్దని నోటీలు జారీ చేసినా, నిబంధనలకు విరుద్ధంగా ఆదివారం మాంసం విక్రయాలు ఎందుకు జరిపారంటూ ఈవోపీఆర్డీ దుకాణ దారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వీటిపై గ్రామ మహిళా పోలీసులు పర్యవేక్షించాలని ఆదేశాలు ఇచ్చామన్నారు. నెలరోజుల వరకు మాంసం విక్రయాలు జరిపితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామం మధ్యలో మాంసం విక్రయాలు చేస్తుండంతో అపరిశుభ్రత నెలకొని చుట్టుప్రక్కల వారు అనారోగ్యానికి గురవుతున్నారని స్థానికుల నుంచి ఫిర్యాదులు వచ్చాయన్నారు. పంచాయతీ సర్వసభ్య సమావేశంలో చర్చించి, తీర్మానం చేసి, గ్రామం చివర మాంసం విక్రయాలు జరిగేలా త్వరలో చర్యలు తీసుకుంటామని ఈవోపీఆర్డీ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

కూర్మావతారంలో శ్రీజగన్నాథుడు



ద్వారకాతిరుమల, జూలై 8: కూర్మావతారంగా శ్రీజగన్నాథ స్వామి సోమవారం భక్తులకు దర్శన మిచ్చారు. పురాతన ఆలయమై, శ్రీవారి ప్రధానాలయానికి దత్తత దేవాలయమై విరాజి ల్లుతున్న ఈ ఆలయంలో జగన్నాథ రథోత్సవా లను పురస్కరించుకుని స్వామివారు రోజుకో అలంకా రంలో భక్తులను కటాక్షిస్తున్నారు. ఇందులో భాగంగా కూర్మరూపంలో శంఖు, చక్రాలను ధరించి అభయ హస్తాన్ని ప్రసాదిస్తున్న అలంకా రంలో ఉన్న జగన్నాథుని పలువురు భక్తులు దర్శించుకున్నారు.



కాత్రేనిపాడు ఎస్సీ కాలనీ సమీపంలో కోతకు గురైన మార్జిన్

ఆదమరిస్తే అంతే..

కోతకు గురైన రహదారి మార్జిన్

ముసునూరు, జూలై 8: నూజివీడు-ఏలూరు ప్రధాన రహదారి మార్జిన్ కోతకు గురై ఏర్పడిన పెద్దగుంత వల్ల ప్రమాదం పొంచి ఉంది. ఈ రహదారిలో నిత్యం భారీ వాహనాలు వెళతూంటాయి. మార్జిన్ దిగితే ప్రమాదమేనని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏలూరు నుంచి ముసునూరు మండలానికి అధికారులు విధులు నిమిత్తం వస్తుంటారని, ఇంత ప్రమాదకరంగా ఉన్న ఈ రోడ్డు మార్జిన్ గురించి పట్టించుకున్నవారే లేరని వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రధాన రహదారి మార్జిన్‌లో ప్రమాదకరంగా ఉన్న గుంతను తక్షణమే పూడ్చివేసి, మార్జిన్‌ను బలోపేతం చేసేలా ఆర్అండ్‌బీ జిల్లా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

ఫ్లెక్సీ కలకలం

మాజీ ఎమ్మెల్యే దూలం అక్రమాలంటూ జనసేన నాయకుడు ఫ్లెక్సీ

ఇంకా ఎవరైనా బాధితులుంటే తెలపాలని సూచన



దూలం నాగేశ్వరరావు అరాచకాల పేరిట ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

కైకలూరు, జూలై 8: కైకలూరు మాజీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు అక్రమాలు, అరాచకాలపై ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు సంచలనం సృష్టిస్తున్నాయి. కైకలూరు పట్టణ ప్రధాన కూడళ్లలో నాలుగు చోట్ల 27 అంశాలతో భారీ ఫ్లెక్సీలు జనసేన పార్టీ నేత కొల్లి వరప్రసాద్ (బాబి) ఏర్పాటు చేశారు. నెల్లాళ్ల క్రితం వరకు వైసీపీ ప్రభుత్వంలో సామాన్యులు, ఇతర పార్టీల నేతలు వైసీపీ అరాచకాలపై మాట్లాడితేనే కేసులు, భయభ్రాంతులకు గురి చేయడం వంటివి కొల్లలుగా జరిగాయి. వారు చేసిన అరాచకాలు అన్నింటిని ఫ్లెక్సీలో జనసేన నాయకుడు ఏర్పాటు చేయడంతో కూడలిలో పెద్ద ఎత్తున ప్రజలు వాటిని తిలకిస్తున్నారు. ప్రచార మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారమైంది. సోమవారం వైఎస్ జయంతిని పురస్కరించుకుని కైకలూరు నీలం సంజీవరెడ్డి మార్కెట్‌లోని వైఎస్ విగ్రహానికి నివాళులర్పించేందుకు మాజీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు, వైసీపీ నాయకులు తరలివచ్చారు. సరిగ్గా విగ్రహం సమీపంలో ఈ ఫ్లెక్సీని ఏర్పాటు చేయడంతో వైసీపీ శ్రేణులు సైతం ఈ ఫ్లెక్సీని ఆసక్తితో తిలకించారు. కైకలూరు నగర పంచాయతీ కాకుండా అడ్డుకోవడం, జగనన్న కాలనీలో అవినీతి, అమాయకులపై అక్రమ కేసులు, ప్రభుత్వ భవనాల కూల్చివేత వంటి 27 అంశాలకు మాజీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు కారణం అంటూ ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. అయన అవినీతి, అక్రమాలపై ప్రస్తుతం ప్రజలకు తెలియజేస్తోంది మచ్చుకే అని, ఇంకా వారు చేసిన దౌర్జన్యాలు ప్రజల ముందుకు తీసుకువస్తానని కొల్లి వరప్రసాద్ విలేకరుల సమావేశంలో వెల్లడించారు. దూలం నాగేశ్వరరావు బాధితుల సంఘానికి తానే అధ్యక్షుడిని అని, ఇంకా బాధితులుంటే తనను కలవవచ్చుని, వారి అరాచకాలను ఫ్లెక్సీల రూపంలో ప్రజల ముందుకు తీసుకువస్తానంటూ బాబి వెల్లడించారు.



శ్రీహరిపురంలో తనిఖీలు చేస్తున్న విజిలెన్స్ అధికారులు



నూజివీడు సీపీ సీడ్స్‌లో తనిఖీ చేస్తున్న ఏడీఏ స్క్వాడ్

రూ. 28.5 లక్షల ఎరువులు, పురుగు మందుల సీజ్

ముదినేపల్లి, జూలై 8: జిల్లా విజిలెన్స్ అధికారులు సోమవారం సాయంత్రం ముదినేపల్లి మండలంలోని పలు ఎరువుల దుకాణాలను ఆకస్మిక తనిఖీలు జరిపారు. ముదినేపల్లి, శ్రీహరిపురంలోని దుకాణాలను విజిలెన్స్ సీఐ యూజే విల్సన్, భీమిలిపట్నం ఏడీఏ బి.విజయప్రసాద్ ఆధ్వర్యంలో అధికారుల బృందం తనిఖీలు చేసి, ఎరువుల నిల్వలకు సంబంధించిన రికార్డులు, ఇన్వాయిస్‌లను పరిశీలించారు. తనిఖీ చేసిన రెండు దుకాణాల్లోనూ ఎరువులు, పురుగుమందుల నిల్వలకు సంబంధించి రికార్డులు సరిగ్గా లేనందున రూ.22.60 లక్షల విలువైన 186.51 టన్నుల ఎరువులు, రూ 5.97లక్షల విలువైన పురుగు మందులను సీజ్ చేశారు. వాటి అమ్మకాలను నిలిపివేస్తూ ఆదేశాలు జారీ చేశారు. మండవల్లి ఏడీఏ వెంకటమణి, ఏవో జరీనా, వీఏఏలు తదితరులు పాల్గొన్నారు.

నూజివీడు టౌన్: నూజివీడు డివిజన్ పరిధిలో విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఎరువులు, పురుగు మందుల నాణ్యతపై ఆయా దుకాణాల్లో తనిఖీలను నిర్వహించారు. స్క్వాడ్ ఏడీఏ వి.జగదీశ్వర్‌రెడ్డి, రీజనల్ సీఐ టి.నాగవెంకటరాజు ఆధ్వర్యంలో నూజివీడు, ముసునూరు మండలాల్లోని విత్తన, ఎరువుల దుకాణాల్లో నాణ్యతా ప్రమాణాలు, రికార్డుల నిర్వహణపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. నూజివీడు మండలం మీర్జాపురం సీపీ సీడ్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లోనూ, ప్రాసెసింగ్ ప్లాంట్, సీడ్ స్టాక్ నిల్వలు తదితరాలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. నూజివీడు వ్యవసాయ శాఖ ఏడి జి.విద్యాసాగర్, నూజివీడు, ముసునూరు మండల వ్యవసాయా. ధికారులు ఎ.చాముండేశ్వరి, ఎస్.మధుమోహన్ తదితరులు పాల్గొన్నారు.




సింగరాయపాలెం – అల్లూరు మధ్య రహదారి మరమ్మతులు (ఇన్‌సెట్) దాత రవిరాజు

దాత ఔదార్యంతో రహదారి అభివృద్ధి

ఎమ్మెల్యే కామినేని ప్రశంస

ముదినేపల్లి, జూలై 8 : ధ్వంసమైన ఆ రహదారిలో కొన్నేళ్లుగా పలువురు ప్రాణాలు కోల్పోతున్న ఘటనలపై చలించి సొంత ఖర్చుతో రహదారి పనులు ప్రారంభించేందుకు దాత ముందుకు వచ్చారు. ముదినేపల్లి - భీమవరం (వయా ఏలూరుపాడు) స్టేట్ హైవేలో సింగరాయపాలెం నుంచి అల్లూరు వరకు పలు చోట్ల పెద్ద గోతులతో ఉండి లోడు వాహనాలు బోల్తా పడటం ఎక్కువైంది. ప్రమాదకరంగా ఉన్న రహదారిని గత ప్రభుత్వం పట్టించుకోలేదు. దీంతో ముదినేపల్లి మండలం రాజానగరం గ్రామానికి చెందిన పారిశ్రామికవేత్త కోసూరి రవిరాజు సొంత ఖర్చులతో రహదారి మరమ్మతులు చేసేందుకు ముందుకొచ్చారు. ఇందుకు రాజానగరం క్షత్రియ యూత్, బీకేఆర్ అండ్ కేకేఆర్ చారిటబుల్ ట్రస్ట్ కూడా సహకరించింది. సుమారు రూ.3 లక్షలతో రవిరాజు గోతుల రోడ్డును ఆరు కిలోమీటర్ల మేర చదును చేయించి గ్రావెల్‌తో గోతులను పూడ్చించారు. రవిరాజు తన దాతృత్వంతో రోడ్డును బాగు చేయించటం పట్ల గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. దాత కె.రవిరాజు మాట్లాడుతూ సింగరాయపాలెం - అల్లూరు మధ్య రోడ్డు ప్రమాదకరంగా ఉండడం, ప్రభుత్వ ఆర్థిక పరిస్థితిని బట్టి ఇప్పటికిప్పుడు రహదారి అభివృద్ధి చేసే అవకాశం లేకపోవడంతో రహదారి మరమ్మతులకు ముందుకొచ్చానన్నారు. ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వం చేయాల్సిన రహదారి అభివృద్ధి పనులను తన సొంత ఖర్చుతో రవిరాజు చేయటం అభినందనీయమని ఆయనను స్ఫూర్తిగా తీసుకుని రహదార్ల అభివృద్ధికి స్వచ్ఛంద సంస్థలు, దాతలు ముందుకు రావాలన్నారు.



వైఎస్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

వైఎస్ఆర్‌కు ఘన నివాళి

నూజివీడు, జూలై 8: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 75వ జయంతిని పురస్కరించుకుని నూజివీడు కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో అయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు బి.డి. రవికుమార్, ఏలూరు జిల్లా ఉపాధ్యక్షుడు పరిమి సాగర్‌కుమార్, ప్రధాన కార్యదర్శి పాలడుగు నాగభరత్ తదితరులు ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించగా, ఉమ్మడి రాష్ట్రంలో ప్రజా సంక్షేమ కార్యక్రమాల్లో ఆయన తీసుకువచ్చిన విప్లవాత్మక చర్యలను గుర్తుకు తెచ్చారు. నూజివీడు పట్టణ, ముసునూరు కాంగ్రెస్ అధ్యక్షులు పులి శ్రీకాంత్, సూర్యదేవరప్రసాద్, నాయకులు కుమార్, రాజు, యార్లగడ్డ అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



పైప్‌లైన్ పనులను పరిశీలిస్తున్న ఏఈ శరత్

పైప్‌లైన్ పనులను పరిశీలించిన ఏఈ

మండవల్లి, జూలై 8: మండవల్లి మెయిన్ సెంటర్ రహదారి విస్తరణలో భాగంగా నూతన వాటర్ పైప్‌లైన్ పనులను నేషనల్ హైవే ఆర్అండ్‌బీ ఏఈ శరత్ సోమవారం పరిశీలించారు. మంచినీటి పైప్‌లైన్ నిర్మాణం కట్టుదిట్టంగా చేయాలని ప్రజలకు ఎలాంటి అవరోధాలు లేకుండా మంచినీటి సరఫరా జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని ఏఈ శరత్ సూచించారు. మండవల్లి సర్పంచ్ మెండా ఝాన్సీ సురేష్‌బాబు, పంచాయతీ సెక్రటరీ తోట శ్రీనివాసరావు పాల్గొన్నారు. పైప్‌లైన్ నిర్మాణంలో తలెత్తుతున్న సమస్యలను పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు ఏఈ దృష్టికి తీసుకువెళ్ళారు.

ఉపాధి పనులపై విచారణకు కమిటీ

శాట్ డైరెక్టర్ ఆదేశాలతో ఏర్పాటు

ముదినేపల్లి, జులై 8 : ముదినేపల్లి మండలంలో 2023-24 సంవత్సరంలో జరిగిన ఉపాధి పనుల్లో అవకతవకలు జరిగాయని అందిన ఫిర్యాదులపై ప్రత్యేక విచారణకు అధికారిక కమిటీ ఏర్పాటైంది. ఈ పనులపై గ్రామ స్థాయిలో జరిగిన సామాజిక తనిఖీల నివేదికలపై కూడా పునర్విచారణ జరపనున్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో జరిగిన సామాజిక తనిఖీల అనంతరం ఇటీవల మండల స్థాయిలో ముదినేపల్లిలో నిర్వహించిన ప్రజా వేదికల్లో కొన్ని గ్రామాల్లో ఉపాధి పనుల నిర్వహణ, నాణ్యతా లోపం, కూలీల హాజరు, పించన్ల మంజూరు, పంపిణీ, గృహ నిర్మాణాలకు నిధుల మంజూరు తదితర అంశాలపై గ్రామస్థులు, టీడీపీ నాయకులు, డ్వామా అధికారులకు ఫిర్యాదులు అందాయి. ముఖ్యంగా చిగురుకోట, కొరగుంటపాలెం గ్రామాల్లో జరిగిన పనులపై ఎక్కువగా ఫిర్యాదులు అందటంతో ఆయా గ్రామాల్లో తిరిగి తనిఖీలు నిర్వహించాలని ఎస్ఆర్ఈజీఎస్ శాట్ డైరెక్టర్ జగదీష్ కుమార్ ఆదేశాల జారీ చేశారు. దీంతో ఉపాధి పనుల విజిలెన్స్ సోషల్ ఆడిట్, క్వాలిటీ కంట్రోల్ విభాగాల అధికారులతోపాటు డీఆర్‌డీఏ ఏపీడీతో కూడిన అధికారిక కమిటీని డ్వామా పీడీ ఎ.రాము నియమించారు. ఈ కమిటీపై రెండు గ్రామాల్లో ఉపాధి పనులు, రికార్డులు, కూలీల హాజరుపై తనిఖీలు నిర్వహిస్తారని ముదినేపల్లి మండల ఉపాధి ఏపీవో నాగరాజు తెలిపారు. గ్రామ స్థాయి సామాజిక తనిఖీలు అనంతరం పునర్విచారణ చేయటం మండలంలో ఇదే తొలిసారి.

స్విమ్మింగ్‌లో జిల్లా క్రీడాకారుల ప్రతిభ



ఏలూరు రూరల్, జూలై 8: హైదరాబాద్‌లో ఈ నెల 5,6 తేదీల్లో జరిగిన స్విమ్మింగ్ పోటీల్లో ఏలూరు జిల్లా, బిశ్వనాథ్ భత్యా స్విమ్మింగ్ పూల్లో శిక్షణ పొందుతున్న క్రీడాకారులు పతకా లు సాధించారని కోచ్ బండ్ల గణేష్ తెలిపారు. హీమరియన్న, ఎం.ధనుష్‌సాయి, ఎం.రిషిరామ్ బంగారు పతకాలు, ఎం.సంజయ్, టి.అవినాష్ వెండి, రజిత పతకాలు, టి.విష్ణువర్ధన్ రెండు వెండి పతకాలు, ఎం.రిజాయ్‌సన్ రజిత పతకం సాధించారని తెలిపారు. బటర్‌ఫ్లై, ఫ్రీస్టైల్, బ్యాక్‌స్ట్రోక్ విభాగాల్లో పోటీలు జరిగాయని తెలిపారు. విజేతలను కోచ్ గణేష్ అభినందించారు.



చాట్రాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

మూడేళ్లుగా శస్త్ర చికిత్సల్లేవ్!

ఆపరేషన్ థియేటర్‌కు మరమ్మతులు

చాట్రాయి, జూలై 8: చాట్రాయి పీహెచ్‌సీలో ఆపరేషన్ థియేటర్‌కు మరమ్మతులు చేయకపోవటంతో మూడేళ్లుగా కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు నిలిచిపోయాయి. నాడు-నేడు కింద ఇద్దరు కాంట్రాక్టర్లు వచ్చి సగం పనులు చేసి వదిలి వెళ్ళిపోవటంతో ఈ పరిస్థితి ఏర్పడింది. చాట్రాయిలో కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు జరగకపోవటంతో బాలింతలు వారి కుటుంబ సభ్యులు వ్యయప్రయాసలకు గరవుతున్నారు ఇక్కడ నిపుణులైన డాక్టర్లు ఉండటం వలన కుటుంబ నియంత్రణ ఆపరేషన్లకు ఈ పీహెచ్‌సీకి మంచి పేరు ఉండేది. ఇతర మండలాల నుంచి కూడా వచ్చి ఇక్కడ శస్త్రచికిత్సలు చేయించుకునేవారు. బాలింతల ఇబ్బందులు తెలుసుకున్న నూజివీడు మాజీ ఎమ్మెల్యే చిన్నం రామకోటయ్య తన సొంత నిధులతో ఆపరేషన్ థియేటర్‌కి మరమ్మత్తులు చేయిస్తానని అధికారులకు వినతిపత్రం ఇవ్వగా అనుమతి ఇవ్వలేదు. నూజివీడు ఎమ్మెల్యే, గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి ఆపరేషన్ థియేటర్‌కు మరమ్మత్తులు చేయించి కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు పునఃప్రారంభానికి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నేడు ప్రజలకు అందుబాటులో ఎమ్మెల్యే కామినేని

కైకలూరు, జూలై 8: కైకలూరు ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ మంగళవారం కైకలూరు నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండనున్నారు. ఉదయం 8.30 గంటలకు వరహాపట్నం శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో ప్రధాని చేపట్టిన తల్లికి వందనం కార్యక్రమంలో భాగంగా మొక్కలను నాటుతారు. అనంతరం కైకలూరు ఎస్టీవోల కాలనీలో మానవత సేవా సంస్థ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 12 గంటల వరకు కైకలూరు క్యాంప్ కార్యాలయంలో అందుబాటులో ఉంటారు. మధ్యాహ్నం 3 గంటలకు కైకలూరు పంచాయతీ కార్యాలయంలో సిబ్బందిలో సమావేశం అవుతారు. అనంతరం క్యాంప్ కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటారు. రాత్రికి వరహాపట్నంలో ఉంటారు.



సారథి గెలుపుతో తిరుమలకు

ఆగిరిపల్లి, జూలై 8: నూజివీ డు నియోజక వర్గంలో కొలుసు పార్థసారథి గెలుపును పురస్క రించుకుని ఆగిరిపల్లి మండ లం నూగొండపల్లి గ్రామ టీడీపీ నాయకులు, కార్యకర్తలు తిరుమల తిరుపతికి మొక్కులు తీర్చుకోవడానికి బయలుదేరారు. పార్టీ మండల అధ్యక్షుడు మల్లవల్లి కోటేశ్వరరావు, మోర్ల నాగరాజు ఆధ్వర్యంలో 40 మంది కార్యకర్తలు సోమవారం ఉదయం తిరుమలకు పయనమయ్యారు.

టీడీపీ నాయకుడు శోభనాద్రి చౌదరికి సన్మానం



ముదినేపల్లి, జూలై 8 : ముదినేపల్లి మండల టీడీపీ అధ్యక్షుడు చల్లగుళ్ల శోభనాద్రి చౌదరిని మండల పరిషత్ కార్యాలయ అధికారులు, సిబ్బంది సన్మానించారు. సోమవారం పెదపాలపర్రులోని ఆయన స్వగృహంలో కలసి కార్యాలయ ఏవో రమణబాబు, సీనియర్ అసిస్టెంట్ నాగేశ్వరరావు, జూనియర్ అసిస్టెంట్ ఎం.వి.సుబ్బారావు, పంచాయతీ కార్యదర్శి శ్యామ్ సుందర్, గ్రామంలోని సచివాలయ సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు శోభనాద్రి చౌదరిని మర్యాద పూర్వకంగా కలసి సత్కరించారు. కైకలూరు నియోజకవర్గంలో ఎన్‌డీఏ కూటమి విజయం సాధించినందుకు హర్షం వ్యక్తం చేస్తూ ఆయన్ని అభినందించారు.

వైష్ణవికి గ్రామస్థుల సత్కారం



ముదినేపల్లి, జూలై 8 : అమరావతి బ్రాండ్ అంబాసిడర్ అంబుల వైష్ణవిని ముదినేపల్లి మండలం సంకర్షణపురం గ్రామస్థులు సత్కరించారు. సోమవారం ఆ గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ సంకుల నాగరాజు, మాజీ ఉప సర్పంచ్ సంకుల మహంకాళిరావు, మండల పరిషత్ మాజీ కో-ఆప్షన్ సభ్యుడు షేక్ మజీద్ హుస్సేన్, పలువురు టీడీపీ నాయకులు వైష్ణవిని సత్కరించి పొలం అమ్మి రూ.25 లక్షలు రాజధాని నిర్మాణానికి ఇవ్వటం పట్ల అభినందించారు. కుమార్తెను ప్రోత్సహించటం పట్ల వైష్ణవి తండ్రి డాక్టర్ మనోజ్‌ను ప్రశంసించారు. బీపీఎం రాజు, పలువురు మహిళలు పాల్గొన్నారు.

సమస్యలన్నీ పరిష్కరిస్తాం



మాట్లాడుతున్న సర్పంచ్ నవరత్నకుమారి

కైకలూరు, జూలై 8: గ్రామసభలో తమ దృష్టికి వచ్చిన సమస్యలన్నింటిని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ సహకారంతో పరిష్కారానికి కృషి చేస్తామని సర్పంచ్ డీఎం నవరత్న కుమారి అన్నారు. సోమవారం కైకలూరు పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామసభను నిర్వహించారు. ఈ గ్రామసభలో ప్రజలు తాగునీరు, డ్రైనేజీ, విద్యుత్ దీపాలు, పారిశుధ్యం, వర్షాకాలంలో ప్రబలే వ్యాధులు, రోడ్ల వెంబడి పండ్ల దుకాణాలు, పులావ్ బండ్లు, బడ్డీకొట్ల వ్యాపారాల వల్ల కలిగే ఇబ్బందులను ప్రజల సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ కొద్ది రోజులకు కాల్వలకు నీరు వస్తుందని మంచినీటి చెరువులను నింపి ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందిస్తామన్నారు. పంటకాల్వలో ప్రజలు చెత్తాచెదారం, మాంసపు వ్యర్థాలు, క్యారీ బ్యాగులు వేసి కలుషితం చేస్తున్నారని, ఇళ్ల లోని మురుగునీరును పంటకాల్వలోకి చేర్చే వారిపై చర్యలు చేపడుతామన్నారు. ట్రాఫిక్ ఇబ్బందులు సృష్టిస్తున్న వ్యాపారుల ఆక్రమణలను తొలగిస్తామన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ సహకారంలో కైకలూరులో నూతన పైప్‌లైన్‌ల నిర్మాణాన్ని చేపడుతామన్నారు. అలాగే ఇప్పటి వరకు ఇంటి పన్ను, కుళాయి పన్ను వెంటనే గ్రామ పంచాయతీకి చెల్లించి సహకరించాలని కోరారు. పంచాయతీ సిబ్బంది ఎం. రవికుమార్, పి.వి. శ్యామలరావు, వార్డు సభ్యుడు ఎండి గాలిబ్‌బాబు, మాజీ వార్డు సభ్యుడు గుర్రం శ్యామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.